గురువారం
15-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 173
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రకృతి కన్నెర్ర 2లో

ప్రకృతి కన్నెర్ర చేస్తే వరుసగా భూకంపాలు, భారీ వర్షాలు, మంచు తుపానులు, వరదలు, అగ్నిప్రమాదాలు వంటివి సంభవిస్తాయి.

బీసీలకు 50శాతం
కోటా ఇవ్వలేం

సుప్రీం తీర్పుకు అనుగుణంగానే అమలు
కేంద్రమంత్రి సుశ్రీ ప్రతిమా భౌమక్ స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
విద్య, ఉపాధి రంగాలలో ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి సుశ్రీ ప్రతిమా భౌమక్ బుధవారం రాజ్యసభలో స్పష్టం చేశారు. ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని సుదీర్ఘకాలంగా వస్తున్న న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందా? తీసుకున్న పక్షంలో ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం వెల్లడించారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు లోబడి ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో కలిపి మొత్తం 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అయితే జనాభా ప్రాతిపదికన ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలంటూ దేశవ్యాప్తంగా వ్యక్తులు, సంస్థల నుంచి ప్రభుత్వానికి వినతులు అందుతున్నట్లుగా మంత్రి వెల్లడించారు.

ఏపీలో మూడు రూర్బన్ మిషన్ క్లస్టర్ల అభివృద్ధి
ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయ, ఏలూరు, రంపచోడవరం క్లస్టర్లను శ్యామ ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద ఎంపిక చేసినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. రాజ్యసభలో

- మిగతా 2 లో

మోదీ సర్కార్‌ను
నిలదీద్దాం

- సరిహద్దు వివాదంపై 17 విపక్షాల ఉమ్మడి వ్యూహం
- ఖర్గే చాంబర్‌లో సమావేశం
- భవిష్యత్ కార్యాచరణపై నేడు మరోసారి భేటీ

న్యూఢిల్లీ:
కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలు ఏకమయ్యాయి. పార్లమెంటు సమావేశాల వేళ ప్రభుత్వాన్ని అనేక అంశాలపై కలిసి నిలదీయాలని నిర్ణయించాయి. ఇందుకోసం ఉమ్మడి వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నాయి. 17 ప్రతిపక్ష పార్టీల నాయకులు సమావేశమై భారత్-చైనా సరిహద్దు వ్యూహంపై ప్రశ్నలకు పదును పెంచుకున్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు సైతం ప్రవేశపెట్టి, ఇదే అంశంపై చర్చకు డిమాండు చేయాలని నిర్ణయించారు. భేటీలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆర్జేడీ, డీఎంకే, ఆప్, ఎస్పీ, జేడీయూ, ఎన్సీపీ, శివసేన, కేరళ కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, ఏఐయూడీఎఫ్, ఆర్ఎల్డీ, ఎండీఎంకే, వీసీకే, కేసీఎం పార్టీలు పాల్గొన్నాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే

- మిగతా 2 లో

కానరాని భరోసా

రైతన్నను ఆదుకోవడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. మంత్రుల ప్రసంగాల్లో మాటలు కోటలు దాటుతున్నా, చేతలు గడప దాడటం లేదు. చెప్పేదొకటి, చేసేదొకటి అని రైతులు వాపోతున్నారు. కనీసం గోనె సంచులన్నా ఇవ్వాలంటూ వారు అధికారులను బతిమాలుతున్నారు.

2లో

- కేంద్రాల్లో వసతులు నిల్
- ఈ ఏడాదీ పాత సమస్యలే
- చిరిగిన ధాన్యం బస్తాలే ఆధారం
- భారంగా రవాణా చార్జీలు

హైకోర్టు అంటే అలుసా?

సీఎస్... వివరణ ఇవ్వండి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించి ప్రభుత్వ పాఠశాలల స్థలాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈనెల 22న తమ ఎదుట హాజరై దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ జవహర్ రెడ్డిని ఆదేశించింది. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు నిర్మిస్తున్నారని హైకోర్టులో కొంతమంది పిటిషన్‌లు దాఖలు చేశారు. పాఠశాలలకు కేటాయించిన స్థలాల్లో విద్యార్థులకు సంబంధించిన కార్యకలాపాలు జరగాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గతంలోనే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటివరకు జరుగుతున్న నిర్మాణాలన్నీ నిలిపివేయాలని ఆదేశించింది. అయినప్పటికీ కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగించి, వాటి కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. హైకోర్టు ఆదేశాల తర్వాత నిర్మాణం చేపడితే అక్రమ నిర్మాణాలు అవుతాయని, వాటికి ప్రభుత్వ అధికారులు బిల్లులు చెల్లించి కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని తెలిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ధర్మాసనం... ప్రభుత్వ చర్యలపై ఆగ్రహం వ్యక్తం

- మిగతా 2 లో

జరిమానా చెల్లించాల్సిందే

ఇప్పటం కేసులో జడ్జీ ఘాటు వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఇప్పటం గ్రామస్తులకు ఏపీ హైకోర్టులో మరోమారు చుక్కెదురైంది. ఇళ్ల కూల్చివేత వ్యవహారంలో అధికారులు షోకాజ్ నోటీసులిచ్చిన విషయాన్ని దాచిపెట్టి మధ్యంతర ఉత్తర్వులు పొందిన ఇప్పటం గ్రామానికి చెందిన 14 మంది పిటిషనర్లకు ఏపీ హైకోర్టు లక్ష రూపాయల చొప్పున జరిమానా విధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ జరిమానాపై సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు

- మిగతా 2 లో

హరిజన సొసైటీ భూమి స్వాధీనం
చట్ట విరుద్ధం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
హరిజన సొసైటీకి ఇచ్చిన భూమిని ఇష్టానుసారంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం కుదరదని హైకోర్టు తేల్చిచెప్పింది. 48 సంవత్సరాల క్రితం హరిజన సొసైటీకి ప్రభుత్వం ఇచ్చిన భూమిని ప్రస్తుత ప్రభుత్వం అక్రమంగా తీసుకుంటోందంటూ డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన సాడే అర్జునుడు హైకోర్టుని ఆశ్రయించారు. నిరుపేద దళితులు వ్యవసాయం చేసుకోటానికి ఇచ్చిన భూమిని జగనన్న నవరత్నాల పేరుతో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నాన్ని హరిజన సంఘం సవాలు చేసింది. పిటిషనర్, సొసైటీ తరపున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ కోర్టులో వాదనలు వినిపించారు. 48 ఏళ్ల క్రితం ఇచ్చిన భూమిని ఈరోజు బలవంతంగా తీసుకోవటం చట్టవిరుద్ధం...ఎటువంటి నోటీసు ఇవ్వకుండా భూములు తీసుకోవటం వల్ల నిరుపేదలు జీవన భృతిని కోల్పోతున్నారని శ్రావణ్‌కుమార్ వాదించారు. రెండు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం... అక్రమ పద్ధతుల్లో భూమిని స్వాధీన చేసుకోవద్దంటూ డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, రామచంద్రపురం తహలీల్దార్‌ను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఢిల్లీలో బీఆర్ఎస్
తొలి అడుగు

- పార్టీ కార్యాలయం ప్రారంభం
- సతీసమేతంగా కేసీఆర్
- కుమారస్వామి, అఖిలేశ్ హాజరు
- బీఆర్ఎస్ కిసాన్ సెల్ ఏర్పాటు
- అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

విశాలాంధ్ర-హైదరాబాద్:
కేంద్రంపై యుద్ధం ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మరో కీలక అడుగు ముందుకు వేశారు. ఢిల్లీ స్థాయిలో మార్పుతోనే, దేశంలో సమూల మార్పు వస్తుందని జాతీయ పార్టీని ప్రారంభించిన విషయం విదితమే. ఈక్రమంలో బుధవారం మరో అడుగు ముందుకు వేస్తూ ఢిల్లీలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనేక రాష్ట్రాల మాజీ సీఎంలు, ఎంపీలు, జాతీయ రైతు సంఘాల నేతలు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు యాగ పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం కేసీఆర్ దంపతులు, అనంతరం 12.37 గంటలకు గులాబీ జెండాను, అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, కర్ణాటక మాజీ సీఎం కుమార స్వామి పాల్గొన్నారు. కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన తన చాంబర్‌లో కేసీఆర్ కూర్చున్నారు. బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా లెటర్ హెడ్‌పై తొలి సంతకం చేశారు. పార్టీ అనుబంధ సంఘంగా భారత్ రాష్ట్ర కిసాన్ సమితి (బీఆర్ఎస్ కిసాన్‌సెల్) ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా, హర్యానా కురుక్షేత్రకు చెందిన జాతీయ రైతు సంఘం నేత, గుర్నామ్ సింఘ్ చడూని నియమించారు. కార్యాలయ కార్యదర్శిగా రవికోహార్‌ను నియమించారు. జాతీయ అధ్యక్షుడి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇపుడు పాసైన ఎమ్మెల్యేలు, ఫెయిలైన ఎమ్మెల్యేల పేర్లు చదువుతా లేచి నుంచోండి!

9,10 షెడ్యూళ్లలోని సంస్థల విభజన జాప్యంతో
తీవ్రంగా నష్టపోతున్నాం

- తెలంగాణ స్పందించడం లేదు
- ఇది ప్రజల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే
- సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్

2లో

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని షెడ్యూల్ తొమ్మిది, పది సంస్థల విభజనలో ఆలస్యంపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

ఉద్యోగాల భర్తీ ఏదీ?

- 1,472 ఐఏఎస్ పోస్టులు ఖాళీ
- జరగని ఐపీఎస్, ఐఎఫ్ఎస్ నియామకాలు
- 91 మంది సీఎస్ఈ అభ్యర్థులకు నిరాశ
- కేంద్రమంత్రి జితేంద్ర సింగ్



న్యూఢిల్లీ:
అనేక శాఖల్లో ఖాళీలు భర్తీ చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దేశంలోనూ, రాష్ట్రాల్లోనే లక్షల సంఖ్యలో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. ఈ విషయాలను ప్రభుత్వాలే స్వయంగా ప్రకటిస్తున్నప్పటికీ భర్తీకి ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. దేశంలో వేలాది సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రప్రభుత్వం తాజాగా తెలిపింది. 2021లో యూపీఎస్సీ పరీక్ష రాసి ఎంపికైన 91 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించలేదని వెల్లడించింది. దీంతో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్న ప్రకటనల్లో డొల్లతనం బయట పడినట్లు అయింది. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమవుతోంది. ఉద్యోగ కల్పన ఊసే మరిచింది. మతతత్వ అజెండాతో సామ్రాజ్యవాద, బూర్జువా పరిపాలన ద్వారా స్వప్రయోజనాలు పొందటంపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించి ఉద్యోగాలు, ఉపాధి హరించే విధానాలు చేపడుతోంది. పర్యవసానంగా అనేక రంగాల్లో వేలల్లో ఖాళీలు ఉన్నాయి. నియామకాలను ప్రభుత్వం సక్రమంగా చేపట్టడం లేదు.

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) పోస్టులు 1,472 ఖాళీగా ఉంటే, ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)లో 864, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్) 1,057 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభకు రాతపూర్వకంగా

- మిగతా 2 లో

తాండూరు కందిపప్పుకు
భౌగోళిక గుర్తింపు



న్యూఢిల్లీ:
తాండూరు కందిపప్పునకు అరుదైన గుర్తింపు లభించింది. తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో ఎక్కువగా పండించే ఈ కందిపప్పునకు భౌగోళిక గుర్తింపు లభించినట్లు కేంద్రం బుధవారం వెల్లడించింది. దీంతో పాటు అసోం గమోసా, లద్దాఖ్ యాప్రికాట్, మహారాష్ట్రకు చెందిన అలీబాగ్ వైట్ ఉల్లిపాయలకు సైతం జీఐ ట్యాగ్ లభించిందని వాణిజ్య పరిశ్రమల శాఖ తెలియజేసింది. వీటితో దేశవ్యాప్తంగా భౌగోళిక గుర్తింపు పొందిన వాటి

- మిగతా 2 లో

మోదీ సర్కార్‌ను నిలదీద్దాం

(మొదటిపేజీ తరువాయి)

చాంబర్‌లో బుధవారం ఈ సమావేశం జరిగింది. టీఎంసీ పాల్గొనలేదు. చైనాతో సరిహద్దు వివాదంపై చర్చకు ప్రభుత్వం అంగీకరించకపోతే లోక్‌సభ, రాజ్యసభ నుంచి వాకౌట్ చేయాలని విపక్ష ఎంపీలు నిర్ణయించుకున్నారు. ఇంకొన్ని కీలకాంశాలపైనా చర్చించారు. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై సమాలోచనలు జరిపారు. ఈ సమావేశానికి టీఎంసీ నేత సుదీప్ బందోపాధ్యాయ హాజరుకావాల్సి ఉండగా ఆయన అస్వస్థతకు గురి కావడంతో గైర్హాజరైనట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. విపక్షాలతో కలిసి ఉంటామని పేర్కొంది. విపక్ష నేతలు గురువారం మరోమారు సమావేశమై భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించనున్నారు.

ఉభయసభల నుంచి ఎంపీల వాకౌట్

చైనాతో సరిహద్దు వివాదంపై వివరణాత్మక చర్చను ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నట్లు రాజ్యసభకు ఖర్గే వెల్లడించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రకటనలో వాస్తవ పరిస్థితుల వివరణ లేదన్నారు. పూర్తి సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ స్పందిస్తూ ఈ విషయంలో ప్రతిపక్ష సభ్యులు ఎవరూ ఎలాంటి నోటీసు ఇవ్వలేదన్నారు. చర్చకు అనుమతి లేదని చెప్పారు. జీరో అవర్‌ను కొనసాగించాలని ఆదేశాలిచ్చారు. ఖర్గే మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన మైక్‌ను నిలిపివేశారు. 'మేమూ భారతీయులం. ఇది మా దేశం కూడా.. సైన్యానికి మద్దతుగా ఉంటాం' అని ఖర్గే అన్నారు. ఆపై ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఇది సున్నితమైన అంశం కాబట్టి అన్ని విషయాల్లో స్పష్టతివ్వడం కుదరదని మంగళవారమే చెప్పామని డిప్యూటీ చైర్మన్ అనడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. అటు లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సభ మొదలైనప్పుడు కొన్ని అంశాలపై కాంగ్రెస్, డీఎంకే సభ్యులు మాట్లాడాలని భావించారు. ఒక ఎంపీ 'స్టాన్ స్వామికి న్యాయం' అన్న ప్లకార్డు ప్రదర్శించారు. ప్రశ్నోత్తరాల సమయం కీలకమైనదని, ఇది మీకూ ఉపయోగపడుతుందని నిరసనకారులతో స్పీకర్ ఓం బిర్లా అనగా ప్రతిపక్షాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. చర్చ కోసం డిమాండ్ చేశారు. కానీ స్పీకర్ అనుమతివ్వకపోవడంతో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ, ఎన్‌సీ తదితర పార్టీల నేతలు వాకౌట్ చేశారు.

తాండూరు కందిపప్పునకు భౌగోళిక గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్య 432కి చేరిందని పేర్కొంది. జీఐ ట్యాగ్ సాధించిన రాష్ట్రాల్లో కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, కేరళ తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. దేశంలో బాస్మతి రైస్‌కు, డార్జిలింగ్ టీ, చందేరి ఫ్యాబ్రిక్‌కు, మైసూర్ సిల్క్ కాంగ్రా టీ.. ఇలా చాలా వాటికి ఈ జీఐ ట్యాగ్ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి బనగానపల్లి మామిడి, బొబ్బిలి వీణ, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, ఉప్పాడ జామ్దానీ చీరలు, తెలంగాణలోని పోచంపల్లి ఇక్కత్, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, హైదరాబాద్ లాడ్ బజార్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. తాండూరు కందిపప్పు కాగా, రుచికి సంబంధించి ఇతర ప్రాంతాల్లో పండించిన కందిపప్పు కంటే తాండూరు కందిపప్పుకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పప్పు త్వరగా ఉడకడమేకాకుండా త్వరగా పాడవకుండా ఉంటుంది. దేశంలో అనేక రాష్ట్రాల్లో తాండూరు కందిపప్పు పేరుతో దీన్ని విక్రయిస్తారంటే దీని ప్రత్యేకత గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ఏటా తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. ఏపీ, కర్ణాటక, మధ్యప్రదేశ్, యూపీ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది.

జరిమానా చెల్లించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల ఇళ్లను కాపాడుకోవాలన్న ఉద్దేశమేనని న్యాయవాది వాదన వినిపించారు. జరిమానా తగ్గించాలని న్యాయస్థానాన్ని కోరారు. అయితే.. ఈ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు బుధవారం తిరస్కరించింది. న్యాయవాది లక్ష్మీనారాయణరెడ్డి పిటిషనర్లకు కోర్టు విచారణ ప్రక్రియను తెలుగులో వివరించారు. ముందుగా మొదటి పిటిషనర్ బెల్లంకొండ వెంకటనారాయణను న్యాయమూర్తి వివరణ అడిగారు. మేలో తమకు నోటీసు అందిందని, దానిని తీసుకుని ఎమ్మెల్యేను కలిశామని.. ఆ నోటీసులో ఏముందో తమకు తెలియదని ఆ రైతు తెలిపారు. న్యాయవాది టి.సాయి సూర్య స్పందిస్తూ, పిటిషనర్లు రైతులని, వారికి సాధారణ నోటీసుకు, షోకాజ్ నోటీసుకు తేడా తెలియదని, వాస్తవాలను దాచిపెట్టలేదని తెలిపారు. ఈ వాదనలపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు అందిన విషయాన్ని దాచిపెట్టి మధ్యంతర ఉత్తర్వులు పొందడం వాస్తవాలను తొక్కిపెట్టడం కాదా అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిని వదిలిపెట్టేది లేదన్నారు. ఒక్కొక్కరికీ రూ.లక్ష ఖర్చులు విధిస్తున్నట్లు ప్రకటించారు. పిటిషనర్లు చిన్న రైతులని, ఖర్చుల కింద విధించిన రూ.లక్ష మొత్తాన్ని తగ్గించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది అభ్యర్థించారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్లపై దయతలిస్తే ఇలాంటి చర్యలను ప్రోత్సహించడమే అవుతుందని, వారిపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించడానికి అవకాశం ఉన్నా.. ఖర్చులు మాత్రమే విధించి వదిలేశామని స్పష్టం చేశారు.

కేసు నేపథ్యమిది

ఇళ్ల కూల్చివేత వ్యవహారంలో అధికారులు షోకాజ్ నోటీసులిచ్చిన విషయాన్ని దాచిపెట్టి మధ్యంతర ఉత్తర్వులు పొందిన ఇప్పటం గ్రామానికి చెందిన 14 మంది పిటిషనర్లకు హైకోర్టు నవంబర్‌లో షాక్ ఇచ్చింది. ఖర్చుల కింద ఒక్కో పిటిషనర్‌కు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.14 లక్షలు విధించింది. సొమ్మును రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది. పిటిషనర్లు వాస్తవాలను దాచిపెట్టి వ్యాజ్యం దాఖలు చేశారని, స్వచ్ఛమైన మనసుతో కోర్టును ఆశ్రయించలేదని పేర్కొంది. నోటీసులో ఏముందో తెలియదన్న పిటిషనర్ల వాదన నమ్మశక్యంగా లేదని వ్యాఖ్యానించింది. వాస్తవాలను దాచిపెట్టి మధ్యంతర ఉత్తర్వులు పొందడం న్యాయప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని తెలిపింది. నోటీసులిచ్చిన విషయాన్ని దాచడమే గాక ఇవ్వలేదని అబద్ధం చెప్పారని ఆక్షేపించింది. కోర్టుతో ఆటలాడవద్దని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఆదేశాలిచ్చారు. గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, ఇప్పటం గ్రామంలోని రామాలయవీధి రోడ్డు విస్తరణ పేరుతో దశాబ్దాల క్రితం నిర్మించుకున్న తమ ఇళ్లను అధికారులు కూల్చివేస్తున్నారని పేర్కొంటూ గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటనారాయణ, మరో 13మంది ఈనెల 4న అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించారు. ఇళ్ల కూల్చివేత నిమిత్తం అధికారులు జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఆ వ్యాజ్యాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి మే 21న ఇచ్చిన నోటీసుల ఆధారంగా కూల్చివేతలు నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి జరిగిన విచారణలో పిటిషనర్లకు మే 10నే షోకాజ్ నోటీసులు ఇచ్చామని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆ విషయాన్ని వారు అఫిడవిట్లలో పేర్కొనకుండా మధ్యంతర ఉత్తర్వులు పొందారని తెలిపారు. షోకాజ్ నోటీసులు అందుకున్న మాట వాస్తవమేనని పిటిషనర్ల తరఫు న్యాయవాది టి.సాయిసూర్య అంగీకరించారు. ఆ విషయాన్ని అఫిడవిట్‌లో ఎందుకు పేర్కొనలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. షోకాజ్ నోటీసులివ్వకుండా అధికారులు ఏకపక్షంగా ఇళ్లు కూల్చివేస్తున్నారని అఫిడవిట్ వేయడంతోనే మధ్యంతర ఉత్తర్వులిచ్చామన్నారు. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు కోర్టు ముందు హాజరుకావాలని పిటిషనర్లను ఆదేశించారు. 11మంది రైతులు న్యాయస్థానం ముందు హాజరయ్యారు. వ్యక్తిగత కారణాలతో మరో ముగ్గురు రాలేదు. మొత్తం 14 మందికి లక్ష చొప్పున జరిమానా విధించిన విషయం విదితమే.

బీసీలకు 50శాతం కోటా ఇవ్వలేం

(మొదటిపేజీ తరువాయి)

విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ మిషన్ కింద 21 విభాగాలలో చేపట్టిన వివిధ ప్రాజెక్ట్‌ల గురించి వివరించారు. గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం, అగ్రి సర్వీసెస్ ప్రాసెసింగ్, విద్య, స్వయం సహాయక బృందాల ఏర్పాటుతో ఉపాధి కల్పన, ఆరోగ్య, వివిధ గ్రామాలను రోడ్లతో అనుసంధానం చేయడం, గ్రామాలకు పైపులతో తాగు నీటి వసతి కల్పించడం, గ్రామీణ గృహ నిర్మాణం, ప్రజా రవాణా సౌకర్యాల కల్పన, సామాజిక మౌలిక వసతుల కల్పన, పర్యాటక ప్రోత్సాహం, గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించి వీధి దీపాల ఏర్పాటు వంటి అనేక ప్రాజెక్టులను అరకులోయ, ఏలూరు, రంపచోడవరం క్లస్టర్లలో చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

ప్రకృతి కన్నెర్ర

- అమెరికాలో మంచు తుపాను
- 1.30కోట్ల మందిపై ప్రభావం
- 6000 విమానాల రాకపోకలకు అంతరాయం
- డీఆర్ కాంగోలో వర్షబీభత్సం
- ముంచెత్తిన వరదలు - 141 మంది మృతి
- చిలీలో కార్చిచ్చు : 46 ఇళ్లు ధ్వంసం రోడ్డునపడ్డ 184 మంది

కాలిఫోర్నియా/ కిన్షాసా/శాంటియాగో: ప్రకృతి కన్నెర్ర చేస్తే వరుసగా భూకంపాలు, భారీ వర్షాలు, మంచు తుపానులు, వరదలు, అగ్నిప్రమాదాలు వంటివి సంభవిస్తాయి. ప్రస్తుతం ప్రపంచ నలుమూలల దాదాపు ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్థమవుతోంది. సహజ విపత్తులు వివిధ రూపాల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే కోవిడ్‌తో పాటు వేర్వేరు రకాల వైరస్‌లు, ఫ్లూలతో చాలా దేశాలు వణుకుతున్నాయి. తాజాగా అమెరికాలో మంచు తుపాను, డీఆర్ కాంగోలో వర్షాలు, వరదలు, చిలీలో కార్చిచ్చులో ఆస్తి-ప్రాణ నష్టం కలుగుతోంది. మంచు తుపాను కారణంగా కాలిఫోర్నియాలో రోడ్లన్నీ మంచుతో కప్పబడి తెల్లడి దుప్పటిని తలపిస్తున్నాయి. కొలరాడో, నెబ్రాస్కా, సౌత్ డకోటాలో కురుస్తున్న హిమపాతం ప్రజలను ఇబ్బంది పెడుతోంది. ఈదురుగాలులతో పాటు మంచు కురుస్తుండటంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. రోడ్లపై 18 అంగుళాల మేర మంచు పేరుకుపోతుందని అమెరికా వాతావరణశాఖ హెచ్చరిలు జారీ చేసింది. రోడ్లపై చిక్కుకున్న వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 1.30కోట్ల మందిపై మంచు తుపాను ప్రభావం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. చాలా చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. టెక్సాస్, లూసియానా, మిస్సిసిపీతో పాటు పర్వత ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తోంది. కాలిఫోర్నియాలో ఏడు సెంటీమీటర్ల హిమపాతం నమోదైంది. 6000 విమానాలు ఆలస్యంగా నడిచాయి. డిసెంబర్ 26 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ వెల్లడించింది. నెవడాలోనూ మంచు కురుస్తోందని తెలిపింది. అంతేకాకుండా టోర్నడోల ముప్పు ఉన్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

కాంగోలో: డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ) అతలాకుతలమైంది. సోమ, మంగళవారాలు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో మెరుపు వరదలు సంభవించగా కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీగా ఆస్తి-ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటివరకు 141 మంది మరణించగా 280 ఇళ్లు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. 38,787 ఇళ్లు వరదల్లో చిక్కుకున్నాయని కిన్షాసా ప్రజారోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. రహదారులు కోతకు గురైనట్లు పేర్కొంది.

చిలీలో...

చిలీలో కార్చిచ్చు విధ్వంసం సృష్టించింది. 46 ఇళ్ల అగ్నికి ఆహుతి కాగా ఒకరు మరణించారు. ఐదుగురు గాయపడ్డారు. 659 హెక్టార్లలో మంటలు వ్యాపించినట్లు అంతర్గత, ప్రజాభద్రతా శాఖ జాతీయ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కార్యాలయం (ఒనేమీ) వెల్లడించింది.రాజధాని శాంటియాగోకు 70కిమీల దూరంలోని గ్రామీణ పట్టణంలో ఈనెల 11వ తేదీన మంటలు వ్యాపించగా, ఆర్పేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, కార్చిచ్చు రుగులుతూనే ఉన్నదని పేర్కొంది. 184 మంది స్వరం కోల్పోయి రోడ్డున పడ్డారని తెలిపింది. 11శాతం కాలిన గాయాలతో 67ఏళ్ల మహిళ చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇటువంటి 52శాతం ఘటనలకు నిర్లక్ష్యం లేక ప్రమాదాలే కారణాలని చిలీ వ్యవసాయ శాఖ మంత్రి వలన్‌జువా అన్నారు. 35 శాతం వరకు కేసుల్లో కావాలనే నిప్పు రగుల్చుతారని, అలాంటివారిని ఉపేక్షించరాదన్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

న్యూజిలాండ్‌లో ధూమపానం నిషేధం

యువతకు పొగాకు విక్రయించకుండా కొత్త చట్టం

2025 నాటికి పొగాకు రహిత దేశమే లక్ష్యం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌లో సిగరెట్లను నిషేధించే దిశగా ఆ దేశ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. యువతకు పొగాకు విక్రయించకుండా వినూత్నమైన చట్టాన్ని తీసుకు వచ్చింది. 2025 నాటికి పొగాకు రహిత దేశంగా న్యూజిలాండ్ ఉండాలని లక్ష్యం పెట్టుకుంది. సిగరెట్లు కొనుగోలు చేయకుండా యువతపై జీవితకాల నిషేధాన్ని విధించే దిశగా దశలవారీ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. 2009, జనవరి ఒకటవ తేదీ లేదా ఆ తర్వాత జన్మించిన వారెవ్వరికీ పొగాకు విక్రయాలు నిషేధిస్తూ సరికొత్త చట్టాన్ని తెచ్చింది. ఈ క్రమంలో మరో 50 ఏళ్లకు సిగరెట్ కొనాలనుకునే వ్యక్తి తన వయస్సు కనీసం 63 ఏళ్లు అని రుజువు చేసేలా ఆధారాలను చూపించాల్సి ఉంటుంది. 2025 నాటికి న్యూజిలాండ్‌ను పొగాకు రహిత దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యం పెట్టుకున్నట్లు ఆరోగ్య శాఖాధికారులు వెల్లడించారు. తమ అంచనా ప్రకారం నిర్దేశిత లక్ష్యాన్ని అనుకున్న సమయంకంటే ముందే సాధించగలమని వారు ఆకాంక్షించారు. ప్రస్తుతం 56వేల మంది వయోజనులు పొగాకు వ్యవసాన్ని మానేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

స్వలింగ సంపర్కుల వివాహ చట్టంపై బైడెన్ సంతకాలు

వాషింగ్టన్: స్వలింగ సంపర్కులకు సంబంధించిన వివాహ చట్టంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతకాలు చేశారు. చరిత్రాత్మక చట్టం 'రెస్పెక్ట్ ఫర్ మ్యారేజ్ యాక్ట్' ద్వారా స్వలింగ సంపర్కులపై ద్వేషం అంతమవుతుందని ఆకాంక్షించారు. శ్వేతసౌధంలోని సౌత్‌లాన్‌లో వేలాది మంది అతిథుల సమక్షంలో చట్టంపై బైడెన్ సంతకాలు చేశారు. 'పెళ్లి అన్నది చాలా సరళమైన ప్రక్రియ. మీరు ఎవరిని ప్రేమిస్తారు? ఎవరికి నిజాయితీగా ఉంటారు? అంతకుమించి వివాహబంధం మేరేమీ కాదు. ప్రభుత్వ జోక్యం లేకుండా ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పే హక్కు ప్రతి ఒక్కరికి ఉండాలి' అని ఆయనన్నారు.

కానరాని 'భరోసా'

విశాలాంధ్ర-పార్వతీపురం: ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేస్తాం, 21 రోజుల్లో చెల్లింపులు ఉంటాయి, మిల్లర్ల ప్రమేయమే ఉండదు, ప్రతి ధాన్యం గింజను నేరుగా కల్లాల్లోనే కొంటాం, గత సమస్యలు పునరావృతం అవనివ్వమని మంత్రులు, అధికారులు మూడునెలలుగా ఊదరగొట్టారు. తీరా చేతల్లోకి దిగేసరికి వారిచ్చిన హామీలేవీ కనబడటం లేదు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు పదిశాతం ధాన్యం మాత్రమే సిద్ధం చేశారు. మిల్లర్ల ప్రమేయం లేకుండా ధాన్యం కొంటామన్న అధికారు ప్రకటనకు, వాస్తవానికి పొంతన ఉండటం లేదని రైతులు లబోదిబో మంటున్నారు. ధాన్యం సిద్ధంగా ఉందని, గోనెసంచులు ఇవ్వాలని రైతు భరోసా కేంద్రం సిబ్బందిని ప్రాధేయపడుతున్నా లేవని నిష్కర్షగా సమాధానమొస్తోందని వారు వాపోతున్నారు. భరోసా కేంద్రాల్లో తేమశాతం చూస్తున్న సిబ్బంది, బస్తాలు ఎక్కువ చిరిగి ఉండటం, వేయింగ్ మిషన్లు లేకపోవడంతో మిల్లర్లు లేదా వ్యాపారుల వద్దకు వాహనాలు తరలించి వేయింగ్ మిషన్ల ద్వారా బరువు తూస్తున్నారు. దీంతో ప్రతి క్వింటా ధాన్యానికి నాలుగు నుంచి ఐదు కేజీలు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఇక రైతు వద్ద ఉన్న ధాన్యానికి సొంతమండలంలోనో, లేక పక్క మండలంలోనో మిల్లును కేటాయించకపోవడంతో పాటు, సకాలంలో వాహనం రాకపోవడంతో అదనంగా రవాణాకు డబ్బు చెల్లించాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. మరోపక్క మిల్లర్లు ప్రతి క్వింటా ధాన్యం బస్తా దించడానికి రూ.12 వసూలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతుల్లో సందిగ్ధం నెలకొంది. బుధవారం సీతానగరం మండలంలోని జోగమ్మపేటలో రైతులు ధాన్యం నూర్పే కల్లాన్ని 'విశాలాంధ్ర' సందర్శించింది. తమ ధాన్యం తేమశాతం, తూకం తరువాత రైతు భరోసా కేంద్రం సిబ్బంది ట్రక్‌షీట్లు కొట్టి ఈ మండలంలోకాక, దూర ప్రాంత మిల్లులకు తరలించాని చెప్పడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వారు వాపోయారు. సిబ్బంది గోనె సంచులు ఇవ్వడం లేదని, 40 కేజీల బస్తాకు జిల్లాలోని అన్ని చోట్ల కేజీన్నర నుంచి రెండు కేజీల ధాన్యం అదనంగా తూస్తున్నారని, 40 కేజీల బస్తా దించడానికి మిల్లర్లు రూ.5 తీసుకుంటారని తెలిపారు. గోనె సంచులు పూర్తిస్థాయిలో అందజేయాలని, సొంతమండలంలోని మిల్లులకు ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం తూచిన వెంటనే అధికారులు వాహనాలు పంపాలని, గతంలో సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాని జోగమ్మపేట సర్పంచ్ కల్యంపూడి సింహాచలం తదితర రైతులు విజ్ఞప్తి చేశారు.

అక్రమాలు నివారించాలి: రైతు సంఘం

ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అక్రమాలు నిరోధించాలని కోరుతూ ఈనెల16న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (సీపీఐ అనుబంధ సంస్థ) జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ప్రభుత్వం రైతులుకంటే మిల్లర్లు గూర్చే ఎక్కువ ఆలోచన చేస్తోందన్నారు. ఇప్పటికే వారిచ్చిన బ్యాంకు గ్యారంటీ 1:2 ధాన్యం సేకరణకు అవకాశ మిచ్చిందని, ఈ వ్యవహారంలో 1:4 ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ధాన్యంలోడు జరిగిన తర్వాత ట్రాక్ షీట్ వచ్చినప్పుడు ఎక్కడో దూరాన మిల్లులకు పంపించడం వల్ల ప్రభుత్వం ఇచ్చే రవాణా చార్జీలు చాలక, తరలించలేక వాహనాలు రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లాల్లోని అన్ని ప్రాంతాల్లో అనధికారికంగా 80 కేజీల బస్తాలు దగ్గర నాలుగుకేజీలు అదనంగా తూస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో రైతులకు జరుగుతున్న దోపిడీని వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే ధర్నాలో రైతులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

9 రాష్ట్రాల్లో సీబీఐకి అనుమతులు లేవు

న్యూఢిల్లీ: తెలంగాణ, మహారాష్ట్రతో పాటు మొత్తం తొమ్మిది రాష్ట్రాలు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు సాధారణంగా కేసుల విచారణ కోసం ఇచ్చే అనుమతులను రద్దు చేసుకున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభకు తెలిపారు. దిల్లీ ప్రత్యేక పోలీసు వ్యవస్థ (డీఎస్‌పీఈ) చట్టం, 1946లోని ఆరవ సెక్షన్ ప్రకారం ఏదేని రాష్ట్రంలో కొన్ని ప్రత్యేక వ్యక్తులు లేదా కేసులను విచారించేందుకు సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతిని ఉంటుందని ఆయన రాతపూర్వకంగా వెల్లడించారు. అయితే సీబీఐకిచ్చే సాధారణ అనుమతులను చత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మేఘాలయ, మిజోరం, పంజాబ్, రాజస్థాన్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఉపసంహరించుకున్నట్లు సింగ్ తెలిపారు.

సీఎస్... వివరణ ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ ఏ విధంగా భవన నిర్మాణాలు చేపడతారని ప్రశ్నించింది. దీనిపై సీఎస్ కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

తహసీల్దార్ వ్యక్తిగతంగా హాజరవ్వాలి: హైకోర్టు

హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి కోర్టులో తప్పుడు సమాచారం సమర్పించారని కోరుకొండ ఎస్ఐ, తహసీల్దార్‌పై రాజమహేంద్రవరం జడ్జి హైకోర్టుకు నివేదిక సమర్పించిన మరో కేసులో తహసీల్దార్ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణ ఒక వారానికి వాయిదా వేసింది. సివిల్ తగాదాల వ్యవహారంలో కోరుకొండ ఎస్ఐ, తహసీల్దార్‌పై ఇటీవల న్యాయవిచారణకు హైకోర్టు ఆదేశించింది.

33 శాతం ఇంజనీరింగ్ సీట్లు ఖాళీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) ప్రోగ్రామ్‌లలో దాదాపు 33 శాతం సీట్లు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం బుధవారం రాజ్యసభకు తెలియజేసింది. రాజ్యసభలో ఎంపీ కె.కేశవరావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా విద్యా మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ ఈ సంగతి వెల్లడించారు. దేశంలో గత ఐదేళ్లలో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ సంస్థలలో ఆమోదించబడిన, ఖాళీ సీట్ల వివరాలను అందజేశారు. దీని ప్రకారం...2021-22 విద్యా సంవత్సరానికి మొత్తం 12,53,337 మంది అభ్యర్థులు అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. అయితే 4,21,203 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇన్ని సీట్లు ఖాళీగా ఉండడానికి గల కారణాలను మంత్రి వివరిస్తూ... 'ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో సీట్ల భర్తీ డిమాండ్-సరఫరా పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

ఉద్యోగాల భర్తీ ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 2022, జనవరికి మంజూరైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ పోస్టులు 6,789; 4,984; 3,191 చొప్పున ఉన్నట్లు వెల్లడించారు. వీటిలో 5,317 మంది ఐఏఎస్, 4,120 మంది ఐపీఎస్, 2,134 మంది ఐఎఫ్‌ఎస్ అధికారులు పదవుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఖాళీలు ఏర్పడటం, నియామకాలు జరపడం నిరంతరాయ ప్రకియని, యూపీఎస్‌సీ ద్వారా పరీక్షలు నిర్వహించి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లను ఏటా భర్తీ చేస్తున్నట్లు వెల్లడించారు. సివిల్ సర్వీసెస్ పరీక్ష (సీఎస్‌సీ) ద్వారా ఐఏఎస్‌ల వార్షిక భర్తీల సంఖ్యను 180కు పెంచినట్లు తెలిపారు. సీఎస్ఈ-2022 నుంచి సీఎస్ఈ-2030 వరకు ప్రతి సంవత్సరం ఐఎస్ఎస్ అధికారులను నేరుగా నియమించేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. సీఎస్ఈ ద్వారా ఐపీఎస్ అధికారుల సంఖ్యను 200కు ఐఎఫ్‌ఎస్‌ల సంఖ్యను 150కు పెంచినట్లు వెల్లడించారు. 2022, డిసెంబరు 7 వరకు ఏదేని సేవల్లో కేటాయింపు లభించని అభ్యర్థులు 91 మంది ఉన్నట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. యూపీఎస్‌సీ 748 మంది అభ్యర్థులను సిఫార్సు చేసిందన్నారు. ఉద్యోగాల్లో తీసుకోకపోవడానికి పరిమితులు, వైద్య పరీక్ష నివేదికలలో తేడాలు, రిజర్వ్ విభాగంపై దావాలో లొసుగులు, అభ్యర్థిత్వాన్ని రద్దు వంట కారణాలు ఉన్నట్లు తెలిపారు

9,10 షెడ్యూళ్లలోని సంస్థల విభజన జాప్యంతో

తీవ్రంగా నష్టపోతున్నాం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని షెడ్యూల్ తొమ్మిది, పది సంస్థల విభజనలో ఆలస్యంపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ సంస్థల విభజన జాప్యంతో ఏపీ తీవ్రంగా నష్టపోతుందని పిటిషన్‌లో పేర్కొంది. షెడ్యూల్ తొమ్మిది, పదిలో ఉన్న సంస్థల విలువ దాదాపు రూ.1,42,601 కోట్లు. ఈ సంస్థలు దాదాపు 91శాతం తెలంగాణలోనే ఉన్నాయి. విభజన అంశంపై తెలంగాణ స్పందించకపోవడం ఏపీ ప్రజల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనేనని ఏపీ ప్రభుత్వం పిటిషన్‌లో పేర్కొంది. తక్షణమే సంస్థల విభజనకు ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. విభజన చట్టంలోని అంశాలన్నీ పది సంవత్సరాలలోపు అమలు చేయాల్సి ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏ ఒక్క అంశం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోర్టులు, మెట్రో రైలు ప్రాజెక్టులు, కొన్ని కేంద్ర సంస్థలు వంటి అనేక అంశాల ఊసే ఎత్తడం లేదు. అలాగే రాజధాని నిర్మాణానికి నిధులు, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ, రెవెన్యూ లోటు, పోలవరం ప్రాజెక్టుకి నిధులు, కేంద్ర విద్య, వైద్య సంస్థలకు అవసరమైన నిధుల మంజూరు విషయంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. అన్నింటికీ మించి 9,10 షెడ్యూళ్లలోని సంస్థలకు సంబంధించి ఆస్తుల విభజన ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. కేంద్ర హోంశాఖ విభజన అంశాలపై రెండు రాష్ట్రాల సీఎస్‌లతో సమావేశం నిర్వహించినా ప్రగతి కానరాలేదు. ఇక తెలంగాణ ప్రభుత్వం ఈ సంస్థల విభజనకు సంబంధించి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు.

దిల్లీలో బీఆర్ఎస్ తొలి అడుగు

(మొదటిపేజీ తరువాయి)

హోదాలో తొలి నియామక పత్రాలను కేసీఆర్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని దేశ రాజకీయ చరిత్రలో నిలిచిన మహోజ్వల ఘట్టంగా కేసీఆర్ అభివర్ణించారు. భారతదేశ రాజకీయ యవనికపై సరికొత్త అధ్యాయానికి తొలి అడుగు పడిందన్నారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పే లక్ష్యంగా దిల్లీ నడిబొడ్డున బీఆర్ఎస్ పార్టీ జాతీయ కార్యాలయం ఆవిర్భవించిందని తెలిపారు. దేశ రాజధానికి చేరిన తెలంగాణ అస్తిత్వ రాజకీయం నుంచి, భవిష్యత్తు జాతీయ పాలనకు ముందడుగు పడిందన్నారు.

ప్రారంభోత్సవం ఇలా

దిల్లీలోని సర్దార్ పటేల్ మార్గ్, రోడ్డు నెంబర్ 5లో బీఆర్ఎస్ పార్టీ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు మధ్యాహ్నం 12 గంటలకు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు అధ్వర్యంలో చేపట్టిన రాజశ్యామల యాగం పూర్ణాహుతిలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొన్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. యాగంలో కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, తమిళనాడు వీసీకే పార్టీ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్, జాతీయ కిసాన్ నేత గుర్నామ్ సింగ్ తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ నామా నాగేశ్వరరావు తన నివాసంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనానికి సీఎం కేసీఆర్‌తో పాటు ముఖ్య అతిథులు, ఇతర ప్రముఖులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని సర్దార్‌పటేల్ రోడ్డు జై కేసీఆర్, జై భారత్, జై బీఆర్ఎస్ నినాదాలతో హోరెత్తింది. బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు, కటౌట్లతో దిల్లీ గులాబీమయమైంది. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఉత్సాహవంతమైన వాతావరణం నెలకొన్నది.

ఈ కార్యక్రమంలో ఇతర రైతుసంఘాల నాయకులు, మంత్రులు హరీశ్ రావు, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు కే కేశవరావు, జోగినపల్లి సంతోష్ కుమార్, కె.ఆర్. సురేష్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, బండి పార్థసారథి రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ రంజిత్ రెడ్డి, బీబీ పాటిల్, పసునూరి దయాకర్ రావు, మాలోత్ కవిత, మన్నె శ్రీనివాసులు రెడ్డి, నామా నాగేశ్వరరావు, పి, రాములు, వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ కవితతో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు

గుణాత్మక మార్పునకు నాంది: కేటీఆర్

బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభంతో దేశంలో రాబోయే గుణాత్మక మార్పునకు నాంది మొదలైందని రాష్ట్ర ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. బుధవారం దిలీకలలో బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభం సందర్భంగా పార్టీ కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఒక గుణాత్మక మార్పు కోసం జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారని పేర్కొన్నారు. ఆనాడు ఎలాగైతే ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విప్లవాత్మక పంథాను అనుసరించారో, అలాగే ఈనాడు దేశ హితం కోసం నూతన రాజకీయ ఒరవడిని ప్రారంభిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర రావు ప్రత్యేక అనుమతితో దిల్లీలోని బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాలేకపోయానని కేటీఆర్ చెప్పారు. ముందే నిర్ణయించబడిన రెండు కీలకమైన పెట్టుబడి సమావేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సిరిసిల్లలో సెస్ ఎన్నికల నామినేషన్లు కూడా ఉన్నాయన్నారు. తెలంగాణలో అమలవుతున్న ప్రజా సంక్షేమ, ప్రగతి విధానాలు బీఆర్ఎస్ వేదికగా దేశం మొత్తానికి పరిచయమవుతాయని తెలిపారు.

ఆకట్టుకునేలా జూపార్క్‌ల అభివృద్ధి

- అటవీ పరిశోధన కేంద్రాలు బలోపేతం
- అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని జూపార్క్‌లను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని అటవీశాఖ అధికారులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. సచివాలయంలో బుధవారం అటవీశాఖపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సందర్శకులను మరింతగా ఆకర్షిం చేలా తిరుపతి, విశాఖ జూపార్క్‌లను తీర్చిదిద్దాలని, ఇందుకోసం దేశంలోని జంతుసందర్శనశాలల్లో అదనంగా ఉన్న జంతువులను తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మన వద్ద ఎక్కువ సంఖ్యలో ఉన్న జంతువులను ఇతర జూలకు ఇచ్చి, వారి వద్ద ఉన్న జంతువులను మనం తెచ్చుకునే విధానం ఉందని, దీనిపై అధికారులు కసరత్తు చేయాలన్నారు. అలాగే జామ్ నగర్‌లోని ప్రైవేటు జూలో ఉన్న జంతువులను కూడా ఎక్స్ఛేంజ్, లేదా కొనుగోలు ద్వారా కూడా సమీకరించు కోవాలని చెప్పారు. దీనిపై వన్యప్రాణి విభాగం అధికారులు డీపీఆర్ సిద్ధం చేయాలని, నిర్దిష్ట సమయంలోగా వాటిని అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. తిరుపతిలో కపిలతీర్థం నుంచి జూపార్క్ వరకు మెమో ట్రెన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా జూపార్క్‌కు సందర్శకుల సంఖ్య పెరిగేలా చేయవచ్చన్నారు. రాష్ట్రంలో అటవీశాఖ నర్సరీల ద్వారా మేలుజాతి మొక్కలను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. తిరుపతి, రాజమహేంద్రవరంలోని రీసెర్చ్ సెంటర్ల ద్వారా అధిక ఫలసాయం, కలపను అందించే మేలుజాతి మొక్కలను అభివృద్ధి చేయాలన్నారు. అటవీశాఖ నర్సరీల ద్వారా అందుబాటు ధరలోనే ఎర్రచందనం మొక్కలను అందించాలని, అలాగే వెదురు, జీడిమామిడి, నేరేడు, ఉసిరి, చింత, యూకలిప్టస్ వంటి మొక్కలను నర్సరీల ద్వారా మరింత మేలైన జాతులను అభివృద్ధి చేసి అందించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, అటవీ దళాల అధిపతి వై.మధుసూదన్ రెడ్డి, డాక్టర్ బీఎంకే రెడ్డి, ఈఎస్ఎఫ్‌టీ స్పెషల్ సెక్రటరీ చలపతిరావు, వివిధ విభాగాధికారులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా మైనింగ్ రెవెన్యూ సాధించాలి

రాష్ట్రంలో లక్ష్యానికి అనుగుణంగా మైనింగ్ రెవెన్యూ సాధించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గనులశాఖ అధికారులతో బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. 2120 మైనింగ్ ఏరియాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ-ఆక్షన్ నిర్వహించాలనే లక్ష్యం మేరకు వేలం ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మేజర్ మినరల్స్‌కు సంబంధించి 33 ఏరియాలకు ఈ ఆక్షన్ నిర్వహించాల్సి ఉండగా 11 ఏరియాలకు ఈ-ఆక్షన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారన్నారు. సీనరేజీ వసూళ్లను ఔట్ సోర్సింగ్ కింద చేపట్టడం ద్వారా మైనింగ్ ఆదాయం పెరుగుదలను పరిశీలించాలని, అన్ని ఏరియాల్లోనూ దీనిని వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ వీజీ వెంకటరెడ్డి, గనులశాఖ డిప్యూటీ సెక్రటరీ డీ రమాదేవి, జాయింట్ డైరెక్టర్ రాజబాబు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-కాకినాడ/అమలాపురం: కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం, సీపీఐ కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమం సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ప్రతి 50 నిమిషాలకు ఓ రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారని ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ 2వేల మంది రైతులు వ్యవసాయాన్ని వదిలేసి పట్టణాలకు వలస వెళ్లిపోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నిరోధిస్తామని వాగ్దానం చేసిన పాలకులు ఆచరలో విఫలమయ్యారన్నారు. ఆక్వారైతుల పెట్టుబడి ఇబ్బడి, ముబ్బడిగా పెరిగిందని, రొయ్య అమ్మకం రేటు తగ్గి సాగుకు సెలవు ప్రకటించే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పాలక పక్షాలు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్‌పిటీసీ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి సీహెచ్ కేశవ శెట్టి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ చెల్లుబోయిన తాతారావు, కార్యవర్గ సభ్యులు రెడ్డి ధన వెంకట సత్యనారాయణ, జంపన ప్రసాదరావు, నెల్లి బుజ్జి బాబు, బెల్లంకొండ రాముడు, కుడిపూడి సింహాద్రి, కుడిపూడి సత్యనారాయణ, ఆక్వా రైతు సంఘం కన్వీనర్ గెద్దం ప్రభాకర్ రావులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డిరాము, శీలం వెంకటేష్, మండల కార్యదర్శిలు కె రామకృష్ణా మోకా శ్రీనివాసరావు, చప్పిడి గోపాల కృష్ణ, ఉగ్గిరాల నాగరాజు, వనచర్ల విజయకుమార్, సానబోయిన మనోహర్ కాకి రాము, మట్టపర్తి ప్రసాద్, నాయకత్వం వహించారు. సుమారు 100 మంది రైతులు 50 మంది సీపీఐ పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం డీఆర్వో సత్తిబాబుకు మెమోరాండం అందజేశారు.

671వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఉక్కు పరిరక్షణపోరాట కమిటీ చేపట్టిన రిలేనిరాహార దీక్షలు బుధవారం 671వ రోజుకు చేరుకున్నాయి. ఎల్.ఎం.ఎం.ఎం, ఎస్.బి.ఎం కార్మికులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, మంగ వెంకట్రావు, గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ... రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు పెట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అంబానీ, అదానీలను ఆహ్వానిస్తే స్వాగతిస్తామ న్నారు. అయితే పోరాటాలు, ప్రాణత్యాగాలు ద్వారా సిద్ధించిన విశాఖ ఉక్కు వంటి భారీ పరిశ్రమలు కారుచౌకగా కేంద్రం బడా వ్యాపారవేత్తలకు అప్ప జెప్పాలని ప్రయత్నం చేస్తే అమ్మే వాడికి, కొనే వాడికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సొంత గనులు లేకపోయినా లాభాల్లో నడిచిన ఏకైక సంస్థ విశాఖ ఉక్కు అని, దీని ద్వారా ఇప్పటికే లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతోందని చెప్పారు. 20 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యానికి పెంచుకునే అవకాశాలు, వనరులు ఉన్న ఈ పరిశ్రమ వల్ల మరో రెండు లక్షల మందికి ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయనడంలో సందేహం లేదన్నారు. అదానీ, అంబానీ వంటి బడా వ్యాపార వేత్తలకు విశాఖ ఉక్కును అమ్మేస్తే వేలాది మంది ఉపాధి కోల్పోతారని, దీనికి హిందుస్థాన్ జింక్, ఎయిర్ ఇండియా సంస్థలే ప్రత్యక్ష ఉదాహరణలని అన్నారు. డిపార్ట్ మెంట్ నాయకులు సీతారామరాజు, త్రినాథ్, చౌదరి, ఎన్ఆర్‌సీ మూర్తి, మంగ వెంకట్రావు డి.సత్యనారాయణ, ఎల్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ అధ్యాపకులకు హెల్త్‌కార్డులు

ఏపీఎంఎస్ఎస్టీయూ హర్షం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఏపీఎంఎస్ఎస్టీయూ హర్షం వ్యక్తంచేసింది. పదేళ్లుగా ఎదురుచూస్తున్న వారికి ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ కమిషనర్, మోడల్ స్కూల్స్ సంయుక్త డైరెక్టర్‌కు ఏపీఎంఎస్ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు పి.మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టీవీ మార్కండేయ, జి.హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మహేశ్వర్ రెడ్డి, రమేశ్ బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మునిరత్నం కృతజ్ఞతలు తెలిపారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి కోరిన పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్. సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిమ్మన్నలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈహెచ్ఎస్ మంజూరుతో ఉపాధ్యాయులకు కొంత ఉపశమనం లభించినట్లు అయిందని వారన్నారు.

కాంట్రాక్టర్ ముసుగులో అవినీతి దందా

- కడప జిల్లాలో విద్యుత్ అధికారుల అక్రమం
- అడ్డగోలుగా 33కేవీ టవర్ల నిర్మాణం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య
- చర్యలు తీసుకోవాలని సీఎం జగన్‌కు బహిరంగలేఖ

విశాలాంధ్ర-కడప: ప్రభుత్వం ఇచ్చే జీతం చాలడం లేదో లేక కోట్లకు పడగెత్తాలనుకున్నారో కానీ కడప జిల్లాలో విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలంలోని జువారి సిమెంట్ పరిశ్రమకు విద్యుత్ సరఫరా కోసం 33 కేవీ 9 లైన్ టవర్ల వర్క్ ఆర్డర్ కోసం ఎటువంటి ప్రకటన చేయకుండా అధికారులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారని తెలిపారు. పరిశ్రమ వారితో ఎర్రగుంట్ల విద్యుత్ శాఖ అధికారులు, డివిజనల్ స్థాయి అధికారి బినామీ కాంట్రాక్టర్‌ను ఏర్పరచుకొని ఆ పనిని పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. వాస్తవంగా ఒక టవర్ నిర్మించాలంటే అయ్యే ఖర్చు... మెటీరియల్ విలువ రూ.1లక్షా75 వేలతో పాటు కార్మికుల ఖర్చు రూ.50 వేలు అవుతుందని అంచనా. ఈ లెక్కన 42 టవర్లకు కలిపి రూ.94లక్షల 50వేల రూపాయలతో పని పూర్తవుతుందని ఇలాంటి పనులు చేసే కొందరు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కానీ వర్క్ ఆర్డర్ కోసం ఎటువంటి ప్రకటన చేయకుండా అధికారులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తడం వల్ల ఈ పనుల్లో రూ.కోటి 36 లక్షల యాభై వేలు మిగులుతుంది. ఇందులో నియోజకవర్గంలోని పదవి గల వ్యక్తి వాటా 8% అంటే రూ.16లక్షలు కాగా, మొదట రూ.10 ముట్టజెప్పారని, మిగిలిన 6 లక్షల పని పూర్తయ్యాక ఇవ్వనున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో డీఈ శ్రీనివాసులరెడ్డికి రూ.35 లక్షలు, ఏడీ నరసింహారెడ్డికి రూ.20 లక్షలు దక్కేలా ఒప్పందం కుదిరింది. ఈ పనుల్లో కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన అధికారులకు, అనధికారులకు దాదాపు రూ.85 లక్షలు మిగులుతుందని అంచనా. అధికారులు సృష్టించిన డమ్మీ కాంట్రాక్టర్ అమర్నాథ్ రెడ్డికి కేవలం లేబర్ ఖర్చు లు మాత్రమే ఇవ్వడం గమనార్హం. మిగిలిన పనులన్నీ డీఈ, ఏడీలు చేయిస్తున్నట్లు తెలిసింది. పనులను పర్యవేక్షించే అధికారులే కాంట్రాక్టర్లు కావడంతో తమ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. ఈ విద్యుత్ లైన్ మొత్తం ఎర్రగుంట్ల చిలంకూరు, ముద్దనూరు మీదుగా కొండాపురం చేరు తుంది. ఇక్కడే వారు నియమ నిబంధనలను తుంగలో తొక్కేశారు. సాధారణంగా ఏదైనా టవర్ ను నిర్మించాలంటే 12 అడుగుల లోతున కాంక్రీట్ వేసి పిల్లర్స్‌ను బిగించిన తర్వాత టవర్ నిర్మించాలి. కొండ ప్రాంతంలో బ్లాస్టింగ్ చేసిన తర్వాత అక్కడ కాంక్రీట్ వేసిన పిదప టవర్ ను బిగించాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికే దాదాపు తొమ్మిది టవర్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిసింది. ఇందులో కొన్ని టవర్లను నాసిరకంగా నిర్మించారు. ఇందుకు గాను రెవెన్యూ, పోలీస్ వారి అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేశారు. ప్రస్తుతం వలసపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లో ఈ పనులు చేస్తున్నారు. దీనిపై గ్రామ సర్పంచ్‌కు గానీ స్థానిక అధికారులకు కూడా సమాచారం ఇవ్వలేదంటే వీరి లోగుట్టు ఏంటో అర్థం చేసుకోవచ్చు. అయితే జువారి సిమెంట్ పరిశ్రమ పనులపై పర్యవేక్షణ చేస్తున్నారో లేదో తెలియాల్సింది ఉంది. ఈ అవినీతి కుంభకోణంలో విద్యుత్ శాఖ డీఈ, ఏడీలను విచారించి చర్యలు తీసుకోవాలని గుజ్జుల డిమాండ్ చేశారు. 'ఈ అక్రమాన్ని మీ ముందుకు తెస్తున్నాము... మరి మీరు విచారించి చర్యలు తీసుకుంటారా లేక వత్తాసు పలుకుతారో ఇక మీ ఇష్టం' అంటూ సీఎంకు రాసిన లేఖను ముగించారు.

సొంత జిల్లాపై జగన్ నిర్లక్ష్యం

- తండ్రి చేపట్టిన ప్రాజెక్టులకూ మొండిచెయ్యి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు విమర్శ

విశాలాంధ్ర-కడప రూరల్: తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తలపెట్టిన ప్రాజెక్టులు, పరిశ్రమలను పూర్తిచేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు విమర్శించారు. వైఎస్ఆర్ కడప జిల్లా సమగ్రాభివృద్ధి కోసం దశల వారీ పోరాటాలకు సమాయత్తం కావాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పి.శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా స్థాయి సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా జిల్లా ప్రజానీకం రాజకీయంగా వైయస్ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచిందని గుర్తుచేశారు. అందుకు కృతజ్ఞతగా ఆయన ముఖ్యమంత్రి కాగానే జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి, మూతపడ్డ పరిశ్రమల పునరుద్ధరణకు, గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ, రాజోలితో పాటు విద్య, వైద్య సంస్థల ఏర్పాటుకు వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి చేశారన్నారు. ఆయన మరణానంతరం ఎక్కడ పనులు అక్కడ ఆగిపోయాయన్నారు. జగన్ సీఎం కాగానే రాజశేఖరరెడ్డి చేపట్టిన పనులు పూర్తి చేస్తారని అంతా ఆశించారని, మూడున్నరేళ్లయినా జగన్ ఏమీ చేయలేకపోయారని ఓబులేసు విమర్శించారు. డిసెంబర్ 23 నాటికి ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేసి మూడేళ్లు అవుతుందని, అయినా ఎలాంటి పురోగతి లేదని మండిపడ్డారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో ఏపీఐఐసీ సేకరించిన భూములు అధికార పార్టీ నేతలకు చేతుల్లోకి వెళ్లడం మినహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించిన దాఖలాలు లేవని చెప్పారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సంబంధించి కమిటీల మీద కమిటీలు వచ్చి పోయాయి తప్ప ఫలితం శూన్యమన్నారు. జగన్‌కు చిత్తూరు పాలకేంద్రం గుర్తుంది...కానీ సొంత జిల్లాలోని ప్రొద్దుటూరు పాలకేంద్రాన్ని విస్మరించారని ఆరోపించారు. గాలేరు నగరి రెండో దశ, కుందు, తెలుగుగంగ ఎత్తిపోతల, హంద్రీనీవా రెండో దశ, రాజోలి నిర్మాణానికి, పంట కాలువల నిర్మాణానికి నిధులు లేక పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఇక నిర్వాసితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కడప-బెంగళూరు రైల్వే లైను, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు రాబట్టడంలో విఫలమయ్యారన్నారు. జిల్లాలో అధికార పార్టీ నేతలు అభివృద్ధిని మరచి భూ మాఫియా, ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారని తీవ్రంగా ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, పి.కృష్ణమూర్తి, బి.రామయ్య, కె.ఆంజనేయులు, వెంకటశివ, ఎంవీ సుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, ఎం.విజయలక్ష్మి, సి.సుబ్రహ్మణ్యం, వి.వీరశేఖర్, పి.సుబ్బరాయుడు, జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా, గంగాసురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల, పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుపై

పునరాలోచించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎం ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బాపట్ల, పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని పున:పరిశీలించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థలో ఎనిమిది మున్సిపాలిటీలతో పాటు 28 మండ లాల్లోని 349 గ్రామాలు... రెండు మున్సిపాలిటీలు, తొమ్మిది మండలాలు, 101 గ్రామాలను బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి తేవాలన్న నిర్ణయం తగదన్నారు. గ్రామాలన్నీ కలిపి పట్టణాభివృద్ధి సంస్థగా ఏర్పాటు చేయడం అప్రజాస్వామికమని, తద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఆయన పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరిగి వ్యవసాయం దెబ్బతింటుందని, ఆదాయాలలో తీవ్ర అసమానతలు ఉండే ప్రాంతాలను ఒకే పరిధిలోకి తేవడం గ్రామీణ ఆర్థికవ్యవస్థను, వ్యవసాయాన్ని దెబ్బ తీయడమే అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అభివృద్ధికి ప్రణాళికలు చేయాలన్నా సాధ్యంకాదని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల విలీనమంటే పల్లెల్లో కూడా పట్టణాల తరహాలో పన్నులు, నిర్మాణాలకు ప్లానింగ్ అనుమతులు అవసరం ఉంటుందని, రహదారులు, పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం భూముల సమీకరణ జరగాల్సి వస్తుందని తద్వారా గ్రామీణ ప్రజలపై పన్నులు, ఫీజుల పేరుతో పెనుభారాలు పెరుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో భూములు కోల్పోతామన్న ఆందోళన ప్రజలలో ఉన్నదన్నారు. సీఆర్‌డీఏ నిర్వీర్యానికి బాపట్ల, పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతుండగా వాటిని నివృత్తి చేయాల్సిన ప్రభుత్వంపై ఉన్నదన్నారు. పట్టణాభివృద్ధి సంస్థలు ఏర్పాటుపై పునరాలోచన చేయాలని కోరారు.

రికార్డు స్థాయిలో పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం

మున్సిపల్‌శాఖ స్పెషల్ సీఎస్ శ్రీలక్ష్మీ

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 522 పట్టణ ఆరోగ్య కేంద్రాల (అర్బన్ హెల్త్ సెంటర్స్)ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె

గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో మంగళగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి కాలనీలో రూ.1.38 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో 95 శాతం అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 522 అర్బన్ హెల్త్ సెంటర్స్ రికార్డు స్థాయిలో పూర్తి చేయటం జరిగిందని, ఇవి కాకుండా 189 హెల్త్ సెంటర్ల మరమ్మతులు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. వీటిలో చిన్న చిన్న వ్యాధులతో పాటు ప్రధాన వ్యాధులకు వైద్యులు అందుబాటులో ఉండటంతో పాటు ల్యాబ్స్, ఫార్మసీ, ఆపరేషన్ విధానం, లేబర్ రూమ్ వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు.

1.50 లక్షల టిడ్కో ఇళ్ల అప్పగింత

రాష్ట్ర వ్యాప్తంగా 2.62 లక్షల టిడ్కో గృహాలు నిర్మించగా, 1.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయడం జరిగిందన్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో ముఖ్యమంత్రి రూ.6 వేల కోట్లతో టిడ్కో ఇళ్లకు ఓ ప్రత్యేక విధానంలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. మౌలిక వసతులు లేవని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ గృహాలు మున్సిపాలిటీ పరిధిలో ఉంటే సంబంధిత మున్సిపాలిటీ చూసుకుంటుందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని సవాల్‌గా తీసుకుని ఎన్‌జీటీ ప్రమాణాలతో ముందుకెళుతున్నామని తెలిపారు. గుడివాడలో 9,500 ఇళ్లు 80 శాతం పూర్తి అయ్యాయన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో రాష్ట్ర సచివాలయానికి వెళ్లే మార్గంలో కూడా టిడ్కో ఇళ్ల నిర్మాణం జరిగిందని, అయితే మౌలిక సదుపాయాలు కల్పించాకే లబ్ధిదారులకు ఇళ్లు స్వాధీనం చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భవానీ దీక్షల విరమణ

పటిష్ట బందోబస్తు: సీపీ కాంతి రాణా

విశాలాంధ్ర-విజయవాడ(క్రైమ్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ గురువారం నుంచి ప్రారంభమవుతోంది. ఉదయం ఆరు గంటలకు హోమ గుండం వెలిగించి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించనున్నారు. దీక్షల విరమణకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాటు చేసినట్లు దుర్గ గుడి ఈవో భ్రమరాంబ వెల్లడించారు. కాగా దీక్షల విరమణ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని విజయవాడ నగర సీపీ కాంతి రాణా వెల్లడించారు. బుధవారం కంట్రోల్ రూమ్‌లో వివిధ ప్రాంతాల నుంచి బందోబస్తుకు వచ్చిన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 15వతేదీ నుంచి 19వతేదీ వరకు ఇంద్రకీలాద్రిపై భవానీదీక్షల విరమణలు జరుగుతాయని, తెల్లవారుజామున 3గంటల నుంచి రాత్రి 11గంటల వరకు భక్తులకు అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులకు భద్రత కల్పించాలని సూచించారు. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్ల వద్ద, తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు ఆస్కారం లేకుంగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తాని చెప్పారు. పోలీస్ సిబ్బంది ప్రతి భక్తుడితో అపాయ్యంగా ఉంటూ భవానీ భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగేలా చూడాలని సూచించారు. ఈ ఈకార్యక్రమంలో డీసీపీ విశాల్‌గున్నీ, రూరల్ డీసీపీ మేరీ ప్రశాంతి, సీఎస్‌డబ్ల్యూ డీసీపీ ఏబీటీఎస్ ఉదయ్‌రాణి, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు, ఎస్‌బీ ఏడీసీపీ లక్ష్మీపతి, ఏసీపీ డాక్టర్ హనుమంతరావు, ఇతర ఏసీపీలు పాల్గొన్నారు.

సీలేరు ఎత్తిపోతలపై చిగురించిన ఆశలు

నిర్మాణానికి కేబినెట్ ఆమోదం



విశాలాంధ్ర-సీలేరు (అల్లూరి జిల్లా): అల్లూరి జిల్లా జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కో ప్రతిపాదిత 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు(ఎత్తిపోతల ప్రాజెక్టు) నిర్మాణానికి కేబినెట్ ఆమోదం లభించడంతో సీలేరుకు మరో ప్రాజెక్టు రానుంది. సీలేరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే ఒక టీఎంసీ నీటిని వెనక్కి పంపింగ్ చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో గత టీడీపీ హయాంలోనే ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదన చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల విద్యుత్ అవసరాలు తీర్చడంతో పాటు గ్రిడ్‌ను సమతుల్యపరచడానికి దోహదపడేందుకు సీలేరు వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఎంతో అనుకూలంగా ఉంటుందని భావించి టీడీపీ... ఈ ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. అప్పటి ప్రభుత్వం ఏపీ జెన్‌కో అధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన సర్వేను యుద్ధప్రాతిపదికన నిర్వహించి ప్రాజెక్టు డిజైన్, డీపీఆర్‌ను తయారు చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. 2023-24లో ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చాలనుకుంది. ఈ మేరకు ప్రాజెక్టు సర్వే పనులను ఏపీ జెన్‌కో వ్యాప్‌కోస్(వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ)కి అప్పగించింది. సీలేరు జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా 1350 మెగావాట్లు ఉత్పత్తి చేసే ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం గల తొమ్మిది యూనిట్లు ఏర్పాటు చేయడానికి వ్యాప్‌కోస్ డిజైన్ చేసింది. దీనికిగాను సీలేరు నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని శాండికోరి పరిసర ప్రాంతాల్లో ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసేలా రబ్బర్ డ్యామ్‌ను నిర్మించడానికి, ఆ నీటిని అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా పంపింగ్ చేసి పార్వతీనగర్ వద్దే భూగర్భంలోనే 1350 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి, ఆ తర్వాత విడుదలయ్యే నీటిని గుంటవాడ జలాశయంలోకి చేరేలా వ్యాప్‌కోస్ సంస్థ డిజైన్ రూపొందించింది. ఇది పూర్తిగా భూగర్భంలోనే వచ్చే ప్రాజెక్టు కావడంతో భూమి లోపల 100 మీటర్ల వరకు భూ పరీక్ష చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 214.5 హెక్టార్ల(530 ఎకరాలు) అటవీ భూమి సేకరించాలి. ప్రాజెక్టు కోసం 2021లో బూసుకొండ గ్రామంలో జెన్‌కో, రెవెన్యూ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. డీపీఆర్ అనంతరం కేంద్ర పర్యావరణ అనుమతులు రావాల్సి ఉండగా ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టలేదు. దీంతో నిర్మాణం జరిగేనా అనే అనుమానం జెన్‌కో అధికారులతో పాటు ఈ ప్రాంతీయుల్లో ఏర్పడింది. అయితే తాజాగా కేబినెట్ సమావేశం నిర్ణయం రాజకీయ లబ్ధి కోసమా? లేక ప్రాజెక్టు పట్టాలెక్కుతుందా అనే అనుమానం ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది. దీనిపై స్థానిక జెన్‌కో అధికారులను ప్రశ్నించగా తమ వద్ద ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

సంపాదకీయం

భయపెడ్తున్న ధరలు

ప్రభుత్వం ఎప్పటికప్పుడు ద్రవ్యోల్బణ రేటు పెరుగుదలను, తగ్గదాన్ని అంచనా వేస్తూనే ఉంటుంది. కానీ ఈ ద్రవ్యోల్బణం రేటులో అప్పుడప్పుడు తగ్గుదల కనిపించినప్పటికీ సామాన్యుడి బతుకు వెతలు ఆ సూచికలకు అనుగుణంగా తగ్గవు. గత రెండు నెలల నుంచి టోకు ధరల సూచీ తగ్గు ముఖం పట్టినట్టు కనిపిస్తోంది. గత రెండు నెలలుగా వ్యవసాయ కార్మికులకు వర్తించే టోకు ధరల సూచీ తగ్గినట్టు గణాంకాలను గమనిస్తే తెలుస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్ లో టోకు ధరల సూచీ 8.39 శాతం ఉంటే నవంబర్ నాటికి అది 5.85 శాతానికి తగ్గింది. గత 21 నెలలుగా ఇంతగా తగ్గడం ఇదే మొదటి సారి. వ్యవసాయ కార్మికులకు వర్తించే టోకు ధరల సూచీ గత అక్టోబర్ లో 7.22 శాతం, గ్రామీణ ప్రజలకు వర్తించే సూచీ 7.34 శాతం ఉంది. నవంబర్ నెలలో టోకు ధరల సూచీలో స్వల్ప తగ్గుదల కనిపించడం తమ ఘనతేనని, తాము ధరలను అదుపు చేయడం వల్లే టోకు ధరలు తగ్గాయని మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. రిజర్వు బ్యాంకు నిర్దేశించినట్టుగా ద్రవ్యోల్బణాన్నీ ఆరుశాతం కన్నా తక్కువ స్థాయిలో ఉండేట్టు చేయగలిగామని కేంద్ర ప్రభుత్వం సంతోష పడిపోతోంది. కానీ ఆహార పదార్థాల ధరలు పెద్దగా తగ్గనందువల్ల సామాన్యుడి బతుకు భారం ఏ మాత్రం తగ్గలేదు. మరి కొన్ని నెలల పాటు పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పు ఉండకపోవచ్చు. దాదాపు 80 కోట్ల మందికి అయిదు కిలోల చొప్పున ఆహార ధాన్యాలు ఇప్పటిదాకా అందుతూ వచ్చాయి. కానీ ఈ నెల తరవాత ఆ సదుపాయం ఉండదు. అందువల్ల పేద వాడికి కలిగే ఊరట ఏమీ ఉండదు. దీనికి తోడు ప్రభుత్వం దగ్గర ఆహార ధాన్యాల నిలవలు తగ్గుతున్నాయి. ప్రభుత్వ గిడ్డంగుల్లో నిలవలు తగ్గితే మార్కెట్లో ధరలకు రెక్కలు రావడం ఖాయం. ప్రభుత్వ గిడ్డంగుల్లో ఆహార ధాన్యాల నిలవలు గత ఆరు సంవత్సరాలలో ఎన్నడూ లేనంత తక్కువగా ఉన్నాయంటున్నారు. ధరలు అదుపు చేయడం కోసం మార్కెట్ లోకి ఆహార ధాన్యాలు భారీగా విడుదల చేసే స్థితిలో ప్రభుత్వం లేదు. రాష్ట్రాల దగ్గర నిలవలూ తగ్గుతున్నాయి. 2021 డిసెంబర్‌లో రాష్ట్రాల దగ్గర గోధుమ నిలవలు 37.85 మిలియన్ టన్నులు ఉంటే అవి 2022 డిసెంబర్ ఆరంభం నాటికి 19 మిలియన్ టన్నులకు పడిపోయాయి. మార్కెట్ లోకి కొత్త గోధుమ పంట రావడానికి 2023 ఏప్రిల్ దాకా ఆగవలసిందే. ప్రభుత్వం నెలకు రెండు మిలియన్ టన్నులకన్నా ఎక్కువ విడుదల చేసే అవకాశం లేదు. ప్రభుత్వం విడుదల చేసే గోధుమలు తగ్గిన కొద్దీ ధరలు మరో నాలుగు నెలల పాటు పెరగక తప్పదు. నవంబర్ లోనూ కేంద్ర ప్రభుత్వం రెండు మిలియన్ టన్నులు మాత్రమే విడుదల చేసినట్టు భారత ఆహార సంస్థ గణాంకాలను పరిశీలిస్తే తెలుస్తోంది. వ్యాపారులు క్రమంగా గోధుమలు విడుదల చేస్తున్నప్పటికీ, 2022 నుంచి గోధుమల ఎగుమతి మీద నిషేధం ఉన్నా మార్కెట్‌లో గోధుమ ధరలు మాత్రం నిలకడగా లేవు. గోధుమ ఎగుమతులను నిషేధించిన తరవాతే స్థానిక మార్కెట్‌లో గోధుమ ధరలు కనీసం 28 శాతం పెరిగాయి. సామాన్య మానవుడు వినియోగించే అనేక సరుకుల ధరలు అంతకంతకూ భారమై పోతున్నాయి. ద్రవ్యోల్బణం 2 నుంచి 4 శాతం కన్నా పెరగకుండా నియంత్రించాలని కేంద్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకుకు సూచించింది. ఒకటి రెండు పాయింట్లు అటూ ఇటు అయినా ఫరవాలేదనుకున్నా ప్రస్తుత ద్రవ్యోల్బణ రేటు 5.59 శాతం ఉంది. గత ఏప్రిల్‌లో అయితే ఎనిమిది ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ద్రవ్యోల్బణం 7.79 శాతానికి పెరిగింది.

రష్యా-ఉక్రేన్ మధ్య యుద్ధంవల్ల ప్రపంచ వ్యాప్తంగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి కనక మన దేశంలోనూ ధరలు పెరగడం అసహజం ఏమీ కాదని సరిపెట్టుకున్నా సామాన్యుడికి మాత్రం అది మోయ లేని భారమే. వినియోగ దార్ల ధరల సూచీలో 40 శాతం ఆహార పదార్థాల ధర మీదే ఆధారపడి ఉంటుంది కనక ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గినట్టు కనిపించడంలో ఆశ్చర్యం లేదు. గత అక్టోబర్ లో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 7.01 శాతం ఉంటే అది నవంబర్‌లో 4.67 శాతానికి తగ్గింది. కూరగాయల ధరలు కూడా 8.08 శాతం తగ్గాయి. ఈ సమయంలో బియ్యం క్రమంగా మార్కెట్ లోకి వస్తాయి. కూరగాయల దిగుబడీ ఇప్పుడు అధికమే. అందువల్ల ధరలు తగ్గడం సహజమే. కానీ వచ్చే నెలలో వీటి ధరలు పెరగక మానవు.

తృణ ధాన్యాల ధరలు 12.96 శాతం, మసాలా దినుసుల ధరలు 19.52 శాతం పెరిగిపోయాయి. గత సెప్టెంబర్‌తో పోలిస్తే ఇంధన ధరలూ దాదాపు ఒక శాతం పెరిగాయి. మధ్య మధ్యలో ఎన్నికలు రావడంవల్ల పెట్రోల్, డీసెల్ ధరలు పెంచకుండా ఆపుతున్నారు. వీటి ధరలు తగ్గడం, పెరగడంతో తమకేమీ సంబంధం లేదని, ఆ వ్యవహారం చమురు కంపెనీలు చూసుకుంటాయని ప్రభుత్వం చెప్తుంది. కానీ తగ్గడం, పెరగడం ప్రభుత్వ చేతిలోని అంశమేనని చమురు కంపెనీలు అంటాయి. ఏమైతేనేమి ఎన్నికల సమయంలో పెట్రోల్, డీసెల్ ధరలు కాస్త అయినా అదుపులో ఉంటాయి. ఇదివరకే ఎక్కువగా ఉన్న ధరలు ఈ సమయంలో మరింత పెరగవు. ఆ మేరకు ఊరటే అనుకోవాలి. వస్త్రాలు, గృహావసర వస్తువులు, వైద్యం, విద్య లాంటి ఖర్చులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. వీటి ద్రవ్యోల్బణం ఆరు శాతానికన్నా ఎక్కువే ఉంది. పెరుగుతున్న ధరల భారాన్ని కంపెనీలు వినియోగదార్ల మీదే మోపుతున్నాయి. నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఈ పెరుగుదల ప్రభావం అనుభవంలోకి వచ్చింది.

ప్రస్తుతం ఆరుశాతంలోపు ఉందనుకుంటున్న ద్రవ్యోల్బణం త్వరలోనే 6.5 శాతానికి చేరే పరిస్థితే కనిపిస్తోంది. అంటే రిజర్వు బ్యాంకు నిర్దేశించిన పరిమితిని మించి పోవచ్చు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ద్రవ్యోల్బణం 6.7 శాతం ఉండొచ్చునని రిజర్వు బ్యాంకు అంచనా వేస్తోంది. కానీ స్థూల జాతీయాభివృద్ధి 7 శాతం అంచనా కాస్తా 6.8 శాతం దగ్గర చతికిల పడే సూచనలే అధికంగా ఉన్నాయి. అక్టోబర్ నాటికి పారిశ్రామిక ఉత్పత్తి కూడా మందకొడిగానే ఉంది. 2021 అక్టోబర్‌తో పోలిస్తే పారిశ్రామిక ఉత్పత్తి మైనస్ నాలుగు శాతం ఉంది. ఇది 2021లో 4.2 శాతం ఉండేది. అంటే పారిశ్రామిక ఉత్పత్తిలో లోటు ఈ ఏడాది ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. వ్యవసాయోత్పత్తులు మెరుగ్గా ఉంటాయని ఆశిస్తే అకాల వర్షాలు, తుపాన్లు పంటలను దెబ్బ తీస్తున్నాయి.

కరోనా కాలంలో వ్యవసాయమే దిక్కు

కరోనా మహమ్మారి కాలంలో ఇతర రంగాలతో పోలిస్తే వ్యవసాయ రంగం గత మూడేళ్లలో 11 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించింది. అదే కాలంలో ఇతర రంగాలలో 15 మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎమ్ఐఈ) పేర్కొంది. మిగులు పంట ఉత్పత్తులను ఎక్కడ నిల్వచేశారు. సీఎమ్ఐఈ నిర్వహించిన ఇంటింటి సర్వే ప్రకారం, 2021-22 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగంలో 4.5 మిలియన్ల మందికి ఉపాధి కల్పించినట్లు అంచనా వేసింది. 2020-21 మహమ్మారి కాలంలో 21.7 మిలియన్ల మంది ఉపాధి అవకాశాలు కోల్పోగా, వ్యవసాయరంగంలో గణనీయంగా 3.4 మిలియన్ల మందికి ఉపాదిని కల్పించింది. 2019-20 కాలంలో వ్యవసాయరంగంలో అదనంగా 3.1 మిలియన్లు మందికి ఉపాధి కల్పించింది.

సకాలంలో రుతుపవనాల రాక, అధికోత్పత్తి, మరో పక్క అధిక ధరల కారణంగా వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నట్లు సీఎమ్ఐఈ పేర్కొంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కొంచెం పెరిగినప్పటికీ గ్రామీణ ఉత్పత్తిదారులకు పెద్దగా ఉపయోగపడలేదు. ఉత్పత్తి ఉన్నప్పటికీ, కరోనాకాలంలో వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ లేకపోవడంతో రైతులు కష్టాలు మాత్రం తీరలేదు. రైతుల జీవనవిధానం మాత్రం మెరుగుపడలేదు. రైతుల పరిస్థితి భయంకరంగా ఉంది. దీనితో వలసల రేటు భారీగా ఉంది. 2019-20లో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల్లో వ్యవసాయ రంగం 5.5శాతం వృద్ధి చెందగా, వ్యవసాయేతర రంగాలు 3.5శాతం పెరిగాయి. 2020-21లో, వ్యవసాయ రంగం 3.3 శాతం వృద్ధి చెందింది, అయితే ఆర్థికవ్యవస్థ మాత్రం 6.3శాతం క్షీణించింది. అయితే 2021-22 లో ఆర్థికవ్యవస్థ కోలుకుంటుండగా, వ్యవసాయరంగం మాత్రం 3.3శాతం వృద్ధిని నమోదుచేసింది. విలువ జోడించిన స్థూల జాతీయ ఉత్పత్తిలో 80 శాతానికి పైగా ఉన్న పరిశ్రమ, సేవలరంగం 54.4 శాతం శ్రామిక శక్తికి ఉపాధి కల్పించింది. వ్యవసాయానికి సంబంధించినంత వరకు 2019-20 లో విలువ జోడించిన స్థూల జాతీయోత్పత్తిలో 18.19 శాతం వాటా కాగా 45.6 శాతం శ్రామికులు ఈ రంగంలోనే ఉన్నారు. 2021 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 151 మిలియన్ల మంది వ్యవసాయ కార్మికులుగా ఉపాధిపొందుతున్న ఒకే ఒక రంగం వ్యవసాయం. సంవత్సరం తర్వాతి సంవత్సరం 4.1శాతం వృద్ధి చేందుతూ, ఈ రంగం దాదాపు 40.9శాతం ఉపాధి వృద్ధిని నమోదుచేసింది. 2021 ఆర్థిక సంవత్సరంలో 151.79, 2020లో 145.88, 2019లో 143, 2018లో 143.83, 2017లో145.66 మిలియన్ల మంది ఉపాధి పొందారు.

రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 2011 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో మొత్తం వ్యవసాయ కార్మికుల సంఖ్య 234.1 మిలియన్లకు పెరిగింది, వారిలో 127.3 మిలియన్లమంది సాగు దారులు కాగా, 106.8 మిలియన్ల మంది వ్యవసాయ కార్మికులుగా ఉన్నారు. ఇటీవలి సంవత్సరాలలో వ్యవసాయ కార్మికుల వాటా 2000లో 58.2 శాతం, 2011లో 54.6 శాతానికి తగ్గింది. వ్యవసాయ కార్మికులు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడంతో వ్యవసాయ కార్మికుల సంఖ్య తగ్గడానికి ఒక కారణం. ఇది అభివృద్ధి ప్రక్రియలో సాధారణ ప్రక్రియ. పట్టణీకరణ పెరుగుతున్న క్రమంలో పరిశ్రమలు, సేవల రంగంలో మెరుగైన వేతనాలు, ఉపాధి అవకాశాలే ఈ మార్పుకు కారణం. భారతదేశ మిశ్రమ ఆర్థికవ్యవస్థలో, మంచి ఉపాధి అవకాశాల కోసం ప్రజల వలసలు అనివార్యం. ఆఆర ధాన్యాల ఉత్పత్తి అత్యధిక స్థాయిలో నమోదైంది. 2018-19లో పంటల ఉత్పత్తి 284.95 మిలియన్ టన్నులకు పెరిగింది.

మన రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం, భూమి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది, అందువల్ల సాగుభూమిని విస్తరించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. పంటలసాగు, అభివృద్ధి రాష్ట్రాలకు కేంద్రం సహాయం చేయాల్సిన అవసరం ఉంది. అయితే వాస్తవంగా కేంద్రం తన ప్రయోజనాల కోసం భూమిని సేకరించే పనిలో నిమగ్నమై ఉంది. సేవల, నిర్మాణ రంగానికి భూములను దారాదత్తం చేయడం ద్వారా కార్పొరేట్ రంగాన్ని అభివృద్ధిచేయడం కోసం ఈ భూములు సేకరిస్తోంది. భారతదేశం ఆకలి సూచికలో 121 దేశాలలో 107వ స్థానానికి పడిపోయినప్పటికీ, వెల్తుంగర్‌హిలైఫ్ వంటి ఏజెన్సీలను విమర్శించడంలో కేంద్ర ప్రభుత్వం బిజీగా ఉంది. ఇండియా వెల్త్ రిపోర్ట్ 2021, నివేదికలో భారతదేశంలో డాలర్-మిలియనీర్ కుటుంబాల సంఖ్య 2020తో పోలిస్తే 2021లో 11 శాతం అంటే 4,58,000 కుటుంబాలకు పెరిగింది. ఒక కుటుంబం కనీసం 7 కోట్ల (1 మిలియన్ డాలర్లు) నికర విలువను కలిగి ఉంటే, వారిని డాలర్-మిలియనీర్ కుటుంబంగా పరిగణించారు. దేశంలో డాలర్-మిలియనీర్ కుటుంబాల సంఖ్య వచ్చే ఐదేళ్లలో 30 శాతం పెరిగి 2026లో 6,00,000 చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది. కొంత అభివృద్ధి జరుగుతున్నప్పటికీ దీని వెనుక నీడలా వెంటాడుతున్నాయి. ధాన్యం ఉత్పత్తి పెరిగినా ఆకలి సూచి అధికమవుతోంది. కనీస వేతనాలు లేవు. కనీస మద్దతు ధర అమలు కావడంలేదు.

కడప ఉక్కుపై మోదీ దగా

టి.లక్ష్మీనారాయణ
సామాజిక ఉద్యమకారుడు

కడప ఉక్కు పరిశ్రమకు "ఫీజుబులిటీ" లేదు - మోదీ ప్రభుత్వం దగాకోరు వైఖరి
ఉక్కుసంకల్పంతో కార్పోరేట్ సంస్థ జే.ఎస్.డ.బ్ల్యూ స్టీల్స్‌ను జగన్ ఒప్పించారు- అధికారపార్టీ పత్రికలో వార్త
ప్రైవేటు సంస్థకు లాభదాయకంగా ఉన్నప్పుడు, ప్రభుత్వ రంగ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాకు లేదంటే ఎలా నమ్మాలి!

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం మేరకు రాష్ట్ర ప్రభుత్వంహక్కుగా పోరాడి కడపఉక్కు కర్మాగారాన్ని ఎందుకు సాధించలేక పోయింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధినేతల 'రాచ'క్రీడలకు ప్రతిబింబం, "కడప ఉక్కు పరిశ్రమ". ఇది నడుస్తున్న చరిత్ర. ఇందులో కొన్ని అంశాలను ప్రజలు నిశితంగా పరిశీలించాలి. మోదీ ప్రభుత్వం "ఫీజుబులిటీ (లాభదాయకం)" లేదని తెల్చేసింది. ఒకనాడు బ్రాహ్మణి ఉక్కు కర్మాగారానికి డా.వైఎస్సార్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తాజాగా జే.ఎస్.డ.బ్ల్యూ స్టీల్స్ ప్రతిపాదనకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదం తెలియజేసింది. లాభదాయకంగా ఉంటేనే కదా! ప్రయివేటు సంస్థలు ఉక్కు పరిశ్రమను నెలకొల్పడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో నెలకొల్పడానికి లాభదాయకం కాదంటూ మోదీ ప్రభుత్వం కడప ఉక్కు కర్మాగారాన్ని నిరాకరించడం దగాకోరు విధానంకాక మరేమౌతుంది!

కడప ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పడానికి జే.ఎస్.డ.బ్ల్యూ స్టీల్స్ సంస్థ ముందుకొచ్చిందట. రు.8,800 కోట్లు పెట్టుబడి పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నదట. ఈ మాట, 2019 డిసెంబరు 23 న శంకుస్థాపన చేసిన సందర్భంలో జగన్మోహన్‌రెడ్డి చెప్పారట. మూడేళ్ళ తర్వాత, నిన్న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహకమండలి ఆ ప్రతిపాదనను ఆమోదించిందట. శీఘ్రగతిన అడుగు ముందుకు పడ్డందుకు సంతోషించాలి! నేడు రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్నది. మరొకసారి ఉక్కు కర్మాగారం శంకుస్థాపనకు రంగం సిద్ధమైనట్లుంది. కడప ఉక్కుకర్మాగారం శంకుస్థాపనల పరంపర కొనసాగు తోంది! నాడు బ్రహ్మణి స్టీల్స్‌కు వైఎస్సార్ ముద్దనూరు - జమ్మలమడుగు మధ్య చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న తర్వాత కొప్పర్తి - కంభాలదిన్నే ప్రాంతంలో గత ఎన్నికలకు ముందు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సున్నపురాళ్ళపల్లి సమీపంలో శంకుస్థాపన చేశారు. రాబోయే ఎన్నికలకు ముందు మరొకసారి శంకుస్థాపన చేస్తారేమోనన్న భావన కలుగుతున్నది. అంతే! అందుకే, పరిశ్రమ ఎన్నటికి నెలకొల్పుతారో! అన్న అనుమానం. మనిషి ఆశాజీవి. చూద్దాం!

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం - 2014, భాగం-10: మౌలిక సదుపాయాలు, ప్రత్యేక ఆర్థిక చర్యలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వై.యస్.ఆర్. జిల్లాలో "ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్" ను నెలకొల్పే అవకాశాన్ని 'స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా' అధ్యయనం చేసి 6 మాసాల్లో నివేదిక సమర్పించాలి" అని పేర్కొన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(SAIL) సమర్పించిన నివేదికలో కడప ఉక్కు కర్మాగారం నెలకొల్పడం లాభదాయకంకాదన్న అభిప్రాయాన్ని తెలియజేసిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించి, విభజన చట్టంలోని ఆ హామీని

అటకెక్కించే ప్రయత్నం చేస్తే ప్రజలు ఆందోళనకు పూనుకొన్నారు. దాంతో కాస్తా వెనకడుగు వేసినట్లు నటించి, మెకాన్ సంస్థతో అధ్యయనం చేయిస్తున్నామని, కర్మాగారాన్ని నెలకొల్పుతామని, త్వరలో శంకుస్థాపన కూడా జరుగుతుందన్నంత స్థాయిలో బిజెపి నాయకులు ఒకనాడు నమ్మబలికారు. మరొకవైపు, సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్ ద్వారా చావు కబురు చల్లగా చెప్పినట్లు సాధ్యంకాదని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. లాభాలు గడించవచ్చునుకొంటేనే కార్పోరేట్ సంస్థలు పరిశ్రమలను నెలకొల్పుతాయన్నది జగమెరిగిన సత్యం కదా!

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలన్న ప్రజల డిమాండుకు ఒక నేపథ్యమున్నది. దశాబ్దం క్రితమే ప్రయివేటు రంగంలో 'బ్రహ్మణీ స్టీల్స్' నెలకొల్పడానికి గాలి జనార్ధన్ రెడ్డి కంపెనీకి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి, దాదాపు 14,000 ఎకరాల ప్రభుత్వ బంజరు, అటవీ భూములను రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రపు ధరకు కేటాయించింది. పొరుగునున్న బళ్ళారి జిల్లాలోని ఇనుప ఖనిజంతో పాటు అనంతపురం జిల్లాలో నిక్షిప్తమై ఉన్న ఇనుప ఖనిజం ఆధారంగా ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పరిశ్రమ నిర్మాణానికి సంబంధించి కొంత పని కూడా జరిగింది. ఒక వైపున పరిశ్రమ నిర్మాణానికి చర్యలు చేపడుతూనే ఇనుప ఖనిజం అక్రమ తవ్వకాలకు, అక్రమ రవాణా, అక్రమ ఎగుమతుల ద్వారా భారీ కుంభకోణం, వేల కోట్ల అక్రమార్జనకు పాల్పడి గాలి జనార్ధన్‌రెడ్డి జైలు పాలయ్యారు కూడా.

ఉక్కు పరిశ్రమ నిర్మాణంలో కూడా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు, ప్రభుత్వం కేటాయించిన భూములను బ్యాంకుల వద్ద తనఖా పెట్టి రుణాలు తీసుకోవడం వగైరా అవకతవకలకు పాల్పడ్డారని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించు కొని అనుమతులను రద్దు చేసి, భూములను వాపస్ తీసుకొన్నది. దాంతో బ్రహ్మణీ స్టీల్స్ నిర్మాణం ఆగిపోయింది. ఈ పూర్వరంగంలో 'సెయిల్' దాన్ని తీసుకొని, పరిశ్రమ నిర్మాణానికి ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలం గానే స్పందించినట్లు వార్తలూ వచ్చాయి. ఈ తంతు నడుస్తుండగానే రాష్ట్ర విభజన జరిగి పోయింది. విభజన చట్టంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం అంశాన్ని పొందుపరచారు. రాయలసీమ ప్రజానీకంలో కాస్త ఆశలు చిగురించాయి. ఆ ఆశలను అడియాసలు చేస్తూ మోదీప్రభుత్వం దగాకోరు విధానానికి పాల్పడింది.

విభజన చట్టంలోని సెక్షన్ 94: "(1)పారిశ్రామికీకరణను, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి కొత్తగా ఏర్పడే రెండు రాష్ట్రాలకు పన్ను ప్రోత్సాహాలతో సహా తగు విధమైన ఆర్థిక చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి. (2) రెండు రాష్ట్రాల్లో భౌతిక, సాంఘికపరమైన విస్తరణతో సహా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సహాయపడాలి" అని పేర్కొన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ మేరకు చర్యలు చేపట్టి వెనుకబడ్డ, కరవు పీడిత రాయలసీమ ప్రాంతంలో కడప ఉక్కు పరిశ్రమను నెలకొల్పడానికి విధాన నిర్ణయం తీసుకొని అమలు చేయడానికి పూనుకొని ఉండాల్సింది. రాయలసీమ లాంటి వెనుకబడ్డ ప్రాంతాలలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వాలకు ఉండవలసింది అంకితభావం. వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణకు పూనుకోవడం, రిజర్వేషన్లను అమలు చేసి సామాజికంగా వెనుకబడ్డ ప్రజానీకానికి ఉపాధి కల్పించడం, భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ రంగం మౌలిక స్వభావం కదా!

100% ఆదాయపు పన్ను రాయితీ, జి.ఎస్.టి. పరిధిలోని పన్నుల్లో 100% రాయితీ, మూలధన పెట్టుబడిని సమకూర్చి, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు భరోసా కల్పించి, ప్రోత్సహించినప్పుడే రాయలసీమ లాంటి వెనుకబడ్డ ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు మెరుగౌతాయి. ఆ వైపున కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం ఆలోచించలేదు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పడానికి సామాజిక, ఆర్థికాభివృద్ధి దృక్పథంతో రాజకీయ సంకల్పం ముఖ్యమైనది. ప్రభుత్వ రంగంలోని "స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెలకొల్పడానికి అవసరమైన కార్యాచరణకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పూనుకొంటే సాధ్యమవుతుంది. సెయిల్‌తో పాటు నేషనల్ మినరల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్(ఎన్.యం.డి.సి.)ల సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పడానికి పూనుకోవాలి. ఉక్కుపరిశ్రమను నెలకొల్పడం ద్వారా లభ్యమవు తున్న ముడి ఇనుప ఖనిజాన్ని సరుకుగా మార్చి అదనపు విలువను జోడించి విదేశాలకు ఎగుమతిచేయడంద్వారా, లేదా దేశీయంగా వినియోగించు కోవడం ద్వారా జాతీయోత్పత్తిని పెంపొందించుకోవచ్చన్న విజ్ఞత కూడా పాలకులు ప్రదర్శించక పోవడాన్ని ఏమనాలి?

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలన్న డిమాండ్ చేసినప్పుడు కూడా ఇందిరాగాంధీ నేతృత్వంలోని నాటి కేంద్రప్రభుత్వం "ఫీజిబిలిటీ" లేదని తిరస్కరిస్తే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" అన్న నినాదంతో ప్రజా ఉద్యమం పెల్లుబికి, 32 మంది ప్రాణాలను బలిదానం చేశాక, నెలకొల్పారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనుల్లేవు. కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నేటికీ కేటాయించలేదు. అయినా నవరత్నాల్లో ఒకటిగా అభివృద్ధి చెందింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు అరవై వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నది. విశాఖపట్నం ఒక మహానగరంగా ఆవిర్భవించడానికి ఉప కరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచింది. దేశ పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తున్నది. రాయలసీమ ప్రాంతంలో అలాంటి ఒక్క పరిశ్రమ కూడా లేకుండా ఉపాధి కల్పన ఎలా జరుగుతుంది? అభివృద్ధిలో ప్రజలను ఎలా భాగస్వాములను చేస్తారు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఈ ఆలోచన కొరవడింది.

మతోన్మాద వ్యతిరేక కూటమి బలపడాలి

డా. అఖిలమిత్ర

రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ, ఆరెస్సెస్ తో పాటు టిఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. రాజ్యాంగ పీఠిక రాజ్యాంగ లక్ష్యాలను తెలియజేస్తుంది. సమాఖ్య విధానం, లౌకికవాదం, పార్లమెంటరీ వ్యవస్థ, గణతంత్ర విధానాలు రాజ్యాంగ మూలసూత్రాలు. సీఏఏ తదితర చట్టాలు తీసుకురావటం, 370 ఆర్టికల్ రద్దు చేయటం ద్వారా లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడింది. కేశవానందభారతీ, ఎస్ఆర్ బొమ్మై కేసుల విషయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ లక్ష్యాలను నిర్వచించిందని గుర్తుంచుకోవాలి. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగంలోని నాలుగు స్తంభాలకు బీటలు వారాయి, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం పౌర సమాజానికి ఏర్పడింది. సిటిజన్ చార్ట్‌తో రాజ్యాంగాన్ని కూల్చటం ప్రారంభమైంది. ఈ దురహంకారాన్ని ప్రగతిశీల ఉద్యమకారులు, దళిత బహుజనులు తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమయింది. హిందు అనేది బీజేపీ పేటెంట్ కాదు. బీజేపీ ఆరెస్సెస్ ఏనాడూ స్వతంత్ర సంగ్రామంలో పాల్గొనలేదు. వీరు ఆదర్శపురుషుడుగా చూపుతున్న గోవాల్కర్‌కు మోసమే ఆదర్శం. బీజేపీది కుహనా దేశభక్తి. నిమ్నజాతి కులాల ఆరాధ్య దైవం డా బి ఆర్ అంబేద్కర్ వర్ధంతి మర్చిపోయే విధంగా అదే రోజు బాబ్రీమసీదు కూల్చేందుకు బీజేపీ నేత అద్వానీ కుట్ర చేశారు. రాజ్యాంగానికి కూడా ఎసరు పెట్టే పరిస్థితులు కనబడుతున్న నేపథ్యంలో లౌకికవాదులు ముందుకు రావాలి. స్వాతంత్ర్యదినోత్సవ వజ్రోత్సవ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో పాలకులు ఏమి చేయబోతున్నారో అనే విషయాలు కశ్మీర్, రామజన్మభూమి అంశాలు వివరిస్తున్నారు. 2024 తరువాత వైషమ్యాలు మరింత పెరిగే అవకాశం ఉంది, మతోన్మాదం తలకెత్తుకుంటే విచక్షణ కోల్పోతారనే భావన ప్రతి వ్యక్తికి ఉండాలి, అలాగే రాజ్యాంగ పరిరక్షణ వేదికను బలోపేతం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పౌర సమాజానిది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగానికి, దాని లక్ష్యాలకు ప్రమాదం ఏర్పడింది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని ఆర్ఎస్ఎస్ మహాత్మాగాంధీని, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 9 ఏళ్ళు జైలు జీవితం గడిపిన నెహ్రూను తక్కువ చేసి మాట్లాడుతోంది. దేశంలో మైనారిటీలను ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చారు, ప్రశ్నించే అభ్యుదయవాదులు గళమెత్తిన నాయకులను జైల్లో పెడుతున్నారు. భారతదేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లే ప్రణాళిక బీజేపీ వద్ద లేదు, అధికారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోంది. మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు.

ఆహార భద్రత విషయంలో బంగ్లాదేశ్, నేపాల్ భారత్ కన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయి. మైనారిటీలపై దాడి చేయటం, మెజారిటీలు తిండి, ఆహార్యం, కట్టుబాట్లు పై మైనారిటీలపై ఆంక్షలు విధిస్తూ రాజకీయంగా లబ్ధి పొంది అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. దేశంలో 63 శాతం మంది బీజేపీకి ఓట్లు వేయలేదు. లౌకికవాద పార్టీలు, ప్రజా తంత్ర వాదులు, వామపక్ష పార్టీలు, దళిత బహుజన పార్టీ చీలికతో ఎన్నికలకు ముందు ఒకేమాట మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మాత్రం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. అందువల్ల బీజేపీ లాభపడుతుంది. రాబోయే రోజుల్లో ముస్లింలు ఎంఐఎం, పైకి సెక్యులర్ పార్టీగా పోజు కొడుతున్న టీఆర్ఎస్, ఆప్ కి ఓటు వేయకుండా చూడాలి. బిజెపికి ప్రత్యక్షంగా లేక పరోక్షంగా మద్దతిచ్చే పార్టీలకు గట్టిగా బుద్ధి చెప్పాలి. కార్పొరేట్ శక్తుల ఆస్తులు పెంచడమే మోదీ ప్రభుత్వ లక్ష్యం. టీఆర్ఎస్ ని బిఆర్ఎస్ గా మార్చి మూడవసారి ముఖ్యమంత్రి కావడానికి కేసీఆర్ యజ్ఞాలు, క్రతువులు రాజ శ్యామలయాగాల పేరుతో ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. జోతిష్యం, వాస్తు బాగాలేదని సెక్రెటేరియట్ కూల్చిన వ్యక్తులతో చాల ప్రమాదకరం. గత ఏడేళ్లుగా బీజేపీతో అంటకాగి అన్ని బిల్లులకు మద్దతిచ్చారు. ఆమ్ఆద్మీ పార్టీ కూడా కరెన్సీ నోట్లపై లక్ష్మీదేవి బొమ్మ ముద్రించాలని వ్యాఖ్యానించటమంటే లౌకికపార్టీలు సైతం ఊగిసలాటలో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

సంఘ్‌పరివార్ శక్తులు 1992లో బాబ్రీ మసీదును కూల్చివేసి, 2002లో గోద్రా అల్లర్లు సృష్టించాయి. అధికారంలోకి రావడానికి ఎంతటి రక్తపాతానికైనా తెగిస్తాయి. రామజన్మభూమి విషయంలో చట్టప్రకారం కాకుండా విశ్వాసం ఆధారంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సాంకేతికతను దేశాన్ని వెనక్కి తీసుకెళ్లటానికి వినియోగి స్తున్నారని వక్కాణిస్తున్నాయి. మతంమారిన వాళ్లను దళితులుగా ఉంచుతారా అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. నూతన విద్యవిధానం 2020లో కాషాయీ కరణ, కేంద్రీకరణ, వ్యాపారీకరణ కు పెద్దపీట వేశారు. విద్యలో సమాన అవకాశాలు లేకుండా చేస్తూ సమాజాన్ని నిర్వీర్యం చేసే విధంగా రూపొందిస్తున్నారు. అలాగే చరిత్ర, లౌకికవాదం, సామ్యవాదం, ప్రజాస్వామ్యం పాతరేసి పుక్కటి పురాణాలకు పెద్దపీట వేస్తున్నారు. చదువు విలువ తెలియని వాళ్లను వైస్ చాన్సలర్లుగా, ఉన్నత సంస్థలకు ఛైర్మెన్‌లుగా నియమిస్తూ పాఠ్యంశాలను మారుస్తున్నారు.

గడచిన ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, నిరుద్యోగాన్ని పెంచి నిత్యావసర సరుకుల ధరలు, రవాణా ధరలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల జీవితాలను ఛిద్రం చేస్తుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఇతర పార్టీల నుండి గెలిచిన అభ్యర్థులపై దండిగా డబ్బులు వెదజల్లుతూ, ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తుంది. ఎన్నికలకు ముందే ఫాసిస్టు, మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉమ్మడి అవగాహనకు రావాల్సిన అవసరముంది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను, అధికారాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అణచివేస్తోంది. జాతీయ విద్యా విధానాన్ని, జీఎస్టీని కేంద్రం రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతోంది, భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. జాతీయ సంపదను మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచి పెడుతూ, గత ఐదు సంవత్సరాలలో పది లక్షల కోట్లు సంపన్న వర్గాలు బ్యాంకులకు చెల్లించ వలసిన బకాయిలను రద్దు చేసాయి. సంక్షేమ దేశంగా ఉన్న భారత్ మోదీ పాలనలో పెట్టుబడి భారత్‌గా మారుతున్నది. రోజురోజుకు నిత్యావసర ధరలు పెరుగుతున్నాయి, నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామన్న మోదీ హామీ, ఎన్నికైన వెంటనే పదిహేను లక్షలు సామాన్యుల ఖాతాలో వేస్తామన్న హామీ ఏమైంది. ఎన్నికైన రాష్ట్రప్రభుత్వ పాలనలో గవర్నర్లు జోక్యం చేసుకుంటూ సఖ్యతలేక బిల్లులు పాస్ చేయడం లేదు . బీజేపీ-ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను, సనాతన ధర్మాన్ని వల్లెవేస్తూ గవర్నర్లు ముందుకు తీసుకెళుతున్నారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ, లౌకిక పరిరక్షణకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక పార్టీలు ఏకమై బీజేపీకి వ్యతిరేకంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో అవగాహనతో ముందుకెళ్లాలి. మారుతున్న రాజకీయ పరిణామాలను, రాజ్యాంగ సంక్షోభాన్ని, బీజేపీ మతతత్వ ప్రమాదాన్ని కాంగ్రెస్ వామపక్ష పార్టీలు అర్థం చేసుకోవాలి, అలాగే కలిసి పోదాం కలుపుకుపోతాం అనే దళిత బహుజన పార్టీలు ఓట్లు చీలకుండా ఐక్యంగాఉంటే రాజ్యాధికారం మనదేనని గుర్తుంచుకోవాలి. కేంద్రంలో బీజేపీకి మరోసారి అధికార మిస్తే దేశ వినాశనం తప్పదని ప్రజలు గ్రహించాలి. కనిష్ఠ ప్రభుత్వం, గరిష్ఠ పరిపాలన అందిస్తానని చెప్పిన మోదీ.. అందుకు భిన్నంగా నిరంకుశ విధానాలు అమలుచేస్తూ దేశాన్ని వినాశనం దిశగా తీసుకుపోతున్నారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను పరిరక్షించు కోవాలంటే బీజేపీని 2024 ఎన్నికల్లో తప్పక ఓడించాలి.

బీహార్‌లో విషాదం

కల్తీ మద్యం తాగి 20 మంది మృతి

అనేకమందికి దెబ్బతిన్న కంటి చూపు

పాట్నా: బీహార్‌లో విషాదం చోటుచేసుకుంది. కల్తీ మద్యం తాగి 20 మంది మృతి చెందారు. మరికొంత మంది పరిస్థితి విషమంగా ఉంది. సరన్ జిల్లా ఛప్రా పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. మొత్తం పదుల సంఖ్యలో ప్రజలు కల్తీ మద్యం సేవించగా.. అందులో ఐదుగురు గ్రామంలోనే మృతి చెందారు. మిగతావారు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. మిగిలిన వారికి చికిత్స జరుగుతోంది.

పోలీసులు మృతదేహాలను పోస్టు మార్టం కోసం తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా కల్తీ మద్యం తాగినవారిలో చాలామంది కంటి చూపు కోల్పోయినట్లు తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇషాప్‌పూర్‌లో మంగళవారం సాయంత్రం మద్యం సేవించిన అనంతరం వారి ఆరోగ్యం క్షీణించిందని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. మొదట అనుమానాస్పద మృతిగా భావించి విచారణ ప్రారంభించారు. అయితే నకిలీ మద్యం తాగటంపై సమాచారం తెలుసుకుని, విచారణ చేపట్టగా ఆ నకిలీ మద్యమే వారి ప్రాణాలకు ముప్పు తెచ్చిందని తెలిపారు. మరణాలు ఇంకా పెరుగుతున్నాయని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. మరింత పక్కా సమాచారం కోసం చనిపోయిన వారిని పోస్టుమార్టం కోసం పంపినట్లు, ఆరోగ్యం క్షీణించిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మాదేపూర్ డీఎస్పీ ఈ విషయమై ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నారు. బీహార్‌లో మద్య నిషేధం అమలులో ఉంది. అయితే, కల్తీ మద్యం మాత్రం ఆ రాష్ట్రంలో విచ్చలవిడిగా లభిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. అక్కడ కల్తీ మద్యం విషాద ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

అసెంబ్లీలో ప్రకంపనలు

కల్తీ మద్యం విషాద ఘటన బీహార్ అసెంబ్లీని కుదిపేసింది. ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలు ముందుగా అసెంబ్లీ ఎదుట ఆందోళన చేశారు. ఆ తర్వాత సభలోనూ నిరసన చేపట్టారు. మద్య నిషేధం అంశంపై ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ను ప్రతిపక్ష నేత విజయ్ కుమార్ సిన్హా ప్రశ్నించారు. అయితే ఈ సందర్భంలో సీఎం నితీశ్ సహనం కోల్పోయారు. బీజేపీ సభ్యులపై ఆయన మండిపడ్డారు. 'మీరే తాగుబోతులు.. మద్య నిషేధం గురించి మీరా మాట్లాడేది?' అని వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. అయితే నినాదాలు చేస్తున్న వారిపై సీఎం నితీశ్ కుమార్ మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏం జరిగింది? నిశ్శబ్దంగా ఉండండి. వారిని సభ నుంచి బయటకు పంపండి' అని అన్నారు. మద్యం తాగి వచ్చారా అంటూ ఆవేశంగా మాట్లాడారు. మరోవైపు ఆర్‌జేడీకి చెందిన మాజీ మంత్రి సుధాకర్ సింగ్ కూడా మద్య నిషేధానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. మద్యంపై నిషేధం విధించకుండా దాని వల్ల కలిగే హానిపై ప్రజల్లో అవగాహన కల్పించడం మంచిదని అన్నారు. 2016 ఏప్రిల్‌లో బీహార్ ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని తీసుకొచ్చింది. ఆ రాష్ట్రంలో మద్యం తాగడం, అమ్మడంపై నిషేధం విధించింది.

లోక్‌సభలో...

బీహార్ కల్తీ మద్యం దుర్ఘటన అంశాన్ని బీజేపీ సభ్యుడు బుధవారం లోక్‌సభలో లేవనెత్తారు. బీహార్‌లో ప్రతిరోజూ వందలాది మంది అక్రమ మద్యం సేవించి మరణిస్తున్నారని జనార్దన్ సింగ్ సిగ్రీవాల్ పేర్కొన్నారు. సరన్ జిల్లా ఎస్పీని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మరో బీజేపీ ఎంపీ రవి కిషన్ శుక్లా జిమ్‌లలో యువ నటుల మరణాన్ని లేవనెత్తారు. ఈ సమస్యను సమగ్రంగా పరిశీలించేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక కమిటీని ఏర్పాటు చేయాలని శుక్లా డిమాండ్ చేశారు.

పదేపదే ప్రస్తావించొద్దు

బిల్కిస్‌బానో అభ్యర్థనపై సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ: బిల్కిస్‌బానో పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ బుధవారం కఠినంగా వ్యవహరించారు. పిటిషన్ విచారణ కోసం కొత్త బెంచ్‌ను ఏర్పాటు చేయాలని పదే పదే ప్రస్తావించవద్దని, చిరాకు తెప్పిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషుల విడుదల పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టాల్సి ఉంది. అయితే ఈ పిటిషన్ విచారణ బెంచ్‌లో భాగమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి బేలా ఎం. త్రివేది వైదొలిగారు. జస్టిస్ త్రివేది 2004-2006 మధ్య కాలంలో గుజరాత్ ప్రభుత్వం న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేశారు. దీంతో ఆమె బెంచ్ నుండి వైదొలగడంతో ఈ కేసు విచారణ వాయిదా పడింది. మరో కొత్త బెంచ్‌కు జాబితా చేయాల్సి ఉంది. గుజరాత్ ప్రభుత్వం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ ఒకరోజు క్రితమే జాబితా చేయబడిందని, కానీ కోర్టు దానిని విచారణకు స్వీకరించలేదని బిల్కిస్ బానో తరపు న్యాయవాది శోభా గుప్తా...సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన ద్విసభ్య ధర్మాసనానికి తెలిపారు. రిట్ జాబితా చేయబడుతుందని, పదేపదే ప్రస్తావించవద్దని సీజేఐ స్పష్టంచేశారు. బిల్కిస్ బానో కుటుంబ సభ్యులను హత్య చేయడంతో పాటు ఆమెపై సామూహిక అత్యాచారం చేసిన నేరం కింద 11 మందిని దోషులుగా గుర్తించి, వారికి జీవిత ఖైదు విధించింది. 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాల్సిందిగా కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే ఈ మార్గదర్శకాల కింది బిల్కిస్ బానో కేసులో శిక్ష పడిన 11 మందిని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. వారి విడుదలను సవాలు చేస్తూ బిల్కిస్ బానోతో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా, సీపీఎం నేత సుభాషిణీ అలీ, స్వతంత్ర జర్నలిస్ట్ రేవతి లాల్, కార్యకర్త రూప రేఖ వర్మ, మాజీ ఐపీఎస్ అధికారి మీరన్ చద్దా తదితరులు సుప్రీంకోర్టుని ఆశ్రయించారు.

స్టాన్‌స్వామిపై కేసు అక్రమమే

ఆయన ల్యాప్‌టాప్‌లో సాక్ష్యాలు హ్యాకర్ సృష్టే

ఆధారాలతో వెల్లడించిన అమెరికా ఫోరెన్సిక్ సంస్థ

న్యూఢిల్లీ: పాలకులు, దర్యాప్తు సంస్థల పనితీరు ఎప్పుడూ సందేహాస్పదమే. ఇష్టమున్న వారిని అందలం ఎక్కించడం...లేనివారిని ఇబ్బందులకు గురిచేయడం సర్వసాధారణమే. అలాంటి పరిస్థితే భీమా-కోరెగావ్ కేసు నిందితుడు స్టాన్‌స్వామి ఎదుర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా...ప్రభుత్వంపై అసమ్మతిగళం వినిపిస్తున్నందుకుగాను స్టాన్‌స్వామిపై పాలకులు కన్నెర్ర చేశారు. ఆయనకు మావోయిస్టులతో సంబంధాలు అంటగట్టి జైలుకు పంపారు. ఈ మొత్తం వ్యవహారంపై ఆర్సెనల్ కన్సల్టింగ్ అనే సంస్థ అనేక సందేహాలు వెల్లడించింది. ఉద్దేశపూర్వకంగానే స్టాన్‌స్వామిపై ఆరోపణలు చేసి జైలుకు పంపినట్లు తెలిపింది. ఈ విషయాలను వాషింగ్టన్ పోస్టు సవివరంగా వెల్లడించింది. స్టాన్‌స్వామికి మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) చూపిన ఆధారాలపై అమెరికాకు చెందిన ఫోరెన్సిక్ సంస్థ సందేహాలు వ్యక్తం చేసింది. ఆరోపిత మావోయిస్టు లేఖలు సహా 40కుపైగా పత్రాలను సైబర్ అటాకర్ ద్వారా స్టాన్‌స్వామి ల్యాప్‌టాప్‌లోకి దొంగచాటుగా ప్రవేశపెట్టినవేనని ఆర్సెనల్ కన్సల్టింగ్ సంస్థ నిర్ధారించింది. గుర్తు తెలియని హ్యాకర్ 2014-2019 మధ్యకాలంలో ఆ పత్రాలను స్టాన్ స్వామి ల్యాప్‌టాప్‌లోకి చొప్పించారని తెలిపింది. జార్ఖండ్‌కు చెందిన సామాజిక ఉద్యమకారుడు, క్రైస్తవ మత బోధకుడు ఫాదర్ స్టాన్ స్వామికి మావోయిస్టులతో సంబంధాలున్నాయని, భీమా-కోరెగావ్‌లో హింసకు ప్రేరేపించారనే ఆరోపణలతో 2020లో ఎన్ఐఏ అరెస్టు చేసింది. బెయిల్ ప్రయత్నాల్లో ఉండగానే 2021 జులైలో ఆయన జైలులోనే మృతి చెందారు. 17 నెలల తర్వాత ఆయన తరపు న్యాయవాదులు ఫోరెన్సిక్ సేవలందించే మసాచుసెట్స్‌కు చెందిన ఆర్సెనల్ కన్సల్టింగ్‌ను సంప్రదించారు. స్టాన్ స్వామి ల్యాప్‌టాప్ ఎలక్ట్రానిక్ డేటాను విశ్లేషించిన ఆ సంస్థ ఇటీవల నివేదికను అందజేసింది. గుర్తుతెలియని హ్యాకర్...నెట్‌వైర్ అనే మాల్‌వేర్‌ను ఉపయోగించి అత్యంత రహస్యంగా 2014 అక్టోబరు 19న స్టాన్ స్వామి ల్యాప్‌టాప్‌ను నియంత్రణలోకి తీసుకుని వివిధ పత్రాలు చొప్పించాడు. స్వామి 'ఎస్ఎస్'అనే పేరుతో విజయన్ దాదా అనే వ్యక్తికి 2017 అక్టోబరులో ఈమెయిల్ పంపించినట్లుగా ఉన్న లేఖ వాటిలో ఒకటి. జార్ఖండ్‌లో నాటి అధికార బీజేపీ సీనియర్ నేతలను కిడ్నాప్ చేసి... రాష్ట్రంలో నిర్బంధ చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేయాలన్నది ఆ లేఖ ఉద్దేశం. మరోపత్రంలో వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టు బలగాలు, ఆయుధాల వివరాలున్నాయి. ఇలా 22 రహస్య ఫోల్డర్లలో లేఖలు, పత్రాలున్నాయి. అయితే, వాటిని స్టాన్ స్వామి ఎప్పుడూ తెరచిన, చూసిన సందర్భాలు లేవు. స్టాన్ స్వామి నివాసంపై పోలీసులు దాడి చేయడానికి ముందు రోజు (2019 జూన్ 11న) ఈ రహస్య ఫోల్డర్లను చెరిపివేసేందుకు హ్యాకర్ తీవ్రంగా ప్రయత్నించినట్లు ఆధారాలు లభించాయి. జూన్12న పుణే పోలీసులు స్టాన్ స్వామి ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడి గురించి ముందే తెలుసుకుని హ్యాకర్ అటువంటి ప్రయత్నాలు చేశాడా? అనే సందేహాన్ని ఫోరెన్సిక్ సంస్థ వ్యక్తం చేసింది. కోరెగావ్ కేసులో సహనిందితులు రోనా విల్సన్, సురేంద్ర గాడ్లింగ్ కంప్యూటర్ సిస్టమ్స్‌లోనూ ఇటువంటి సాక్ష్యాలు చొప్పించినట్లు గుర్తించామని ఆర్సెనల్ కన్సల్టింగ్ పేర్కొంది. ఆయా కంప్యూటర్లలో లభించిన ఆధారాలను ఎన్ఐఏ తన అభియోగాలకు ఆధారాలుగా తెలిపింది.

దిల్లీలో దారుణం

బాలికపై యాసిడ్ దాడి

నిందితుల్లో ఒకరి అరెస్టు

న్యూఢిల్లీ: దేశంలో నిత్యం ఏదో ఒకచోట పిల్లలు, పెద్దలన్న తేడాలేకుండా స్త్రీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా కొందరు మృగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. తాజాగా దేశ రాజధాని దిల్లీలో 17 ఏళ్ల బాలికపై యాసిడ్ దాడి జరిగింది. ఈ ఘటనలో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. బాధిత బాలికను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతుంది. ఈ విషయాన్ని దిల్లీ పోలీసులు ధ్రువీకరించారు. మోహన్ గార్డెన్ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్‌కు యువతిపై యాసిడ్ పోసిన ఘటనకు సంబంధించి ఉదయం 9 గంటలకు పీసీఆర్ కాల్ వచ్చిందని పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దిల్లీ ద్వారకా జిల్లాలోని ఉత్తమ నగర్‌లో బుధవారం ఉదయం సుమారు 7:30 సమయంలో 17ఏళ్ల బాలిక స్కూల్‌కు వెళుతుండగా, బైక్‌పై అటుగా వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా బాలికపై యాసిడ్ పోసి పరారయ్యారు. ఘటనా స్థలంలోనే ఉన్న యువతి సోదరి భయపడుతూ ఇంటికి చేరుకుని విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో హుటాహుటిన వారు దాడికి గురైన బాలికను ఆస్పత్రికి తరలించారు. యాసిడ్ ఆమె రెండు కళ్లల్లో పడిందని, అయితే పడిందని అయితే ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. తనకు ఇద్దరిపై అనుమానం ఉందని బాధిత బాలిక వారి పేర్లను పోలీసులకు వెల్లడించింది. దీంతో సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు బాధితురాలు తెలిపిన వివరాల ఆధారంగా ఇద్దరిలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించారు. బైక్‌పై వచ్చిన యువకులిద్దరూ ముఖం కనిపించకుండా మాస్క్ వేసుకుని ఉన్నారు.

కఠినాతికఠినంగా శిక్షించాలి: కేజ్రీవాల్

బాలికపై యాసిడ్ పోసిన దుండగులను కఠినాతికఠినంగా శిక్షించాలని దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. 'ఇలాంటి వాటిని ఏమాత్రం సహించకూడదు. నిందితులకు ఇంత ధైర్యం ఎలా వచ్చింది. వారిని అసలు విడిచిపెట్టకూడదు. వీలైనంత కఠినంగా శిక్షించాలి. దిల్లీలోని ప్రతి బాలిక క్షేమం మా ప్రాధాన్యం' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

యాసిడ్ అమ్ముతుంటే ఏం చేస్తున్నారు?

నిషేధం ఉన్నప్పటికీ దేశ రాజధానిలో కూరగాయల మాదిరిగానే యాసిడ్ లభ్యమవుతోందని దిల్లీ మహిళా కమిషన్ (డీసీడబ్ల్యూ) చీఫ్ స్వాతి మలివాల్ పేర్కొన్నారు. దీనిని నిరోధించడానికి ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో వీడియో పోస్ట్ చేశారు. తాజా యాసిడ్ దాడి ఘటనపై నగర పోలీసులకు నోటీసులు జారీ చేశామని, దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మలివాల్ విజ్ఞప్తి చేశారు. 'డీసీడబ్ల్యూ అనేక నోటీసులు జారీ చేసింది... అనేక సిఫార్సులు ఇచ్చింది కానీ కూరగాయలు అమ్మినట్లే యాసిడ్ విక్రయం కొనసాగుతోంది. ఎవరైనా యాసిడ్ కొని అమ్మాయిపై వేయవచ్చు... ప్రభుత్వాలు ఎందుకు నిద్రపోతున్నాయి? ఒక అమ్మాయిపై యాసిడ్ దాడి జరిగినప్పుడు, ఆమె ఆత్మ గాయపడుతుంది... ఆమె జీవితం నాశనం అవుతుంది' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. యాసిడ్ అమ్మకాలపై నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు కమిషన్ కోర్టును ఆశ్రయిస్తుందని ఆమె వెల్లడించారు.

సీబీఐ అధికారులపై హత్య కేసు

కోల్‌కతా: ఈ ఏడాది మార్చిలో జరిగిన బోగతుయీ అల్లర్ల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న లలన్ షేక్ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బీర్భుం జిల్లా రాంపుర్ హట్ ప్రాంతంలో ఉన్న సీబీఐ గెస్ట్‌హౌస్‌లోని టాయ్‌లెట్‌లో ఉరికి వేలాడుతూ కనిపించాడు. లలన్ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని సీబీఐ వర్గాలు తెలిపారు. ఇది కాస్తా రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారితీసింది. దీన్ని తీవ్రంగా తీసుకున్న బెంగాల్ పోలీసులు, సీబీఐ అధికారులపై హత్య కేసు నమోదు చేశారు. సీబీఐ డీఐజీ, ఎస్పీ సహా దర్యాప్తు సంస్థకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌పై సీబీఐ కలకత్తా హైకోర్టులో సవాల్ చేయనున్నట్టు సమాచారం. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు భాదూ షేక్ హత్య అనంతరం బోగతుయీ గ్రామంలో జరిగిన అల్లర్లలో 10 మంది మరణించారు. ఈ హింసపై దర్యాప్తు చేయాలని కలకత్తా హైకోర్టు సీబీఐని ఆదేశించింది. భాదూ షేక్ హత్యానంతరం లలన్ షేక్‌కు మరో వర్గానికి జరిగిన రాజకీయ ఆధిపత్య పోరులో భాగంగానే అల్లర్లు జరిగాయని సీబీఐ తన ఛార్జిషీటులో ఆరోపించింది. ఆ సమయంలో ఆందోళనకారులు మనుషుల్ని లోపలపెట్టి ఇళ్లకు నిప్పటించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. డిసెంబరు 4న లలన్ షేక్‌ను పశ్చిమ బెంగాల్-ఝార్ఖండ్ సరిహద్దుల్లో అరెస్టు చేశారు. ఆ తర్వాత అతడిని న్యాయస్థానం కస్టడీకి అప్పగించగా, సీబీఐకి చెందిన తాత్కాలిక శిబిరంలో ఉంచారు. కస్టడీలో లలన్‌ను తీవ్రంగా హింసించారని అతడి కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కేసు నుంచి తప్పించేందుకు సీబీఐ అధికారులు రూ.50లక్షలు డిమాండ్ చేశారని, తన భర్తను చంపేస్తామని కూడా హెచ్చరించారని లలన్ భార్య ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను సీబీఐ ఖండించింది.

హనీట్రాప్ కేసులో నిందితులకు ఈడీ రిమాండ్

భువనేశ్వర్ (ఒడిశా): ఒడిశా హనీట్రాప్ కేసులో నిందితులైన అర్చన నాగ్, ఆమె భర్త జగబంధు చంద్ ఆదాయానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రిమాండుకు అనుమతించింది. మరో ఆరు రోజుల పాటు అర్చనను రిమాండ్‌లో ఉంచేందుకు భువనేశ్వర్‌లోని కోర్టు ఈడీకి అనుమతి ఇచ్చింది. బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు జగబంధును రిమాండ్‌లో తీసుకునేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ అనుమతించింది. సెక్స్ రాకెట్ నడుపుతూ ప్రభావవంతమైన వ్యక్తులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్చన, జగబంధులిద్దరినీ అంతకుముందు రోజు కోర్టు ముందు హాజరుపర్చారు. ఏడు రోజుల రిమాండ్ పూర్తయిన తర్వాత అర్చనను కోర్టులో హాజరుపరచగా, మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్-19 కింద ఈడీ ఆమెను అరెస్టు చేసింది. అసభ్యకరమైన వీడియోలను ఉపయోగించి రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, చిత్రనిర్మాతలతో సహా ఉన్నత స్థాయి వ్యక్తులను బ్లాక్ మెయిల్ చేసి ఈ జంట రూ.30 కోట్లకు పైగా సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2017 నుంచి 2022 మధ్య అర్చన, జగబంధు ఖాతాల్లో జమ అయిన రూ.2.5 కోట్లను ఈడీ ఇప్పటి వరకు గుర్తించింది.

ఘోర రోడ్డు ప్రమాదం... ఆరుగురి దుర్మరణం

ఫిరోజాబాద్(ఉత్తరప్రదేశ్): ఉత్తరప్రదేశ్‌లో, ఫిరోజాబాద్ నగర సమీపంలోని ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న ట్రక్కు బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మరణించారు. మరో 21 మంది గాయపడ్డారు. వారికి సైఫాయి వైద్య కళాశాలలో చికిత్స అందిస్తున్నారు. లూథియానా నుంచి రాయ్‌బరేలీకి 50 మంది ప్రయాణికులతో బస్సు వెళుతుండగా ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై తెల్లవారుజామున 4:30 గంటలకు ప్రమాదం సంభవించింది. బస్సు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో డీఎంసీ వాహనం బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తా పడిందని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. ప్రమాద స్థలం నుంచి బస్సును తొలగించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బీఎస్ఎన్ఎల్'కు ఊపిరి

లోక్‌సభలో మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణకు రూ.1.64 లక్షల కోట్ల భారీ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిందని టెలికాం మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం ఆయన ఈ విషయాన్ని తెలిపారు. త్వరలోనే 4జీ, 5జీ నెట్‌వర్క్‌లు ప్రారంభించనున్నట్టు తెలిపారు. 'మేకిన్ ఇండియా'లో భాగంగా భారత్‌లో రూపొందించి, అభివృద్ధి చేసిన 5జీ సాంకేతికనే బీఎస్ఎన్ఎల్ అమల్లోకి తీసుకురాబోతున్నట్టు వెల్లడించారు. యూపీఏ హయాంలో కొన్ని రాజకీయ పార్టీల వల్ల ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ గడ్డు పరిస్థితులు ఎదుర్కొందన్నారు. ప్రస్తుతం పార్లమెంటు సభ్యులుగా కొనసాగుతున్న కొంతమంది ఆ సంస్థను సొంత 'కామధేనువు'లా వాడుకున్నారని ఆరోపించారు. నిధుల్ని పక్కదారి పట్టించి సంస్థను కష్టాల్లోకి నెట్టారన్నారు. ప్రపంచదేశాలతో పోలిస్తే ప్రస్తుతం భారత్‌లో అత్యంత చౌకగా మొబైల్ డేటా లభిస్తోందని మంత్రి తెలిపారు. ఒక గిగాబైట్ డేటా కేవలం రూ.20కే అందుబాటులో ఉందన్నారు. యూపీఏ హయాంలో ఇది రూ.200గా ఉండేదన్నారు. బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణలో భాగంగా సంస్థ సేవల్ని మరింత ఆధునికీకరించేందుకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. స్పెక్ట్రమ్ కేటాయింపు, 'భారత్ బ్రాడ్‌బ్యాండ్ నిగమ్ లిమిటెడ్‌ను బీఎస్ఎన్ఎల్‌తో విలీనం చేసి ఫైబర్ నెట్‌వర్క్‌ను సైతం మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడల మంత్రిగా ఉదయనిధి స్టాలిన్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పెద్ద కుమారుడు, డీఎంకె ఎమ్మెల్యే ఉదయనిధి బుధవారం క్రీడాశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజభవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రవి, ఉదయనిధితో ప్రమాణం చేయించారు. సీఎం స్టాలిన్, ఇతర కేబినెట్ మంత్రులు హాజరయ్యారు. కరుణానిధి మరణం తర్వాత 2018లో స్టాలిన్ డీఎంకే అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు, ఆయన పార్టీ యువజన విభాగానికి మూడు దశాబ్దాల పాటు నాయకత్వం వహించారు. స్టాలిన్ పార్టీ అధ్యక్షుడైన తర్వాత.. యువజన విభాగాన్ని ఉదయనిధికి అప్పగించారు. స్టాలిన్ వారసుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఉదయనిధి డీఎంకె పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2019లో పార్టీ యువజన విభాగానికి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గతేడాది జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చెపాక్-తిరువల్లికేని నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. గతంలో ఈ నియోజకవర్గానికి ఆయన తాత, డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి ప్రాతినిధ్యం వహించారు. ఉదయనిధి హీరోగా అనేక తమిళ చిత్రాల్లో నటించారు. గతేడాది తమిళనాడు ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్‌గానూ వ్యవహరించారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ, అమిత్‌షాలపై విమర్శలు గుప్పించి జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ఉదయనిధిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని కొద్ది నెలల ముందే నిర్ణయం తీసుకున్నా.. కొన్ని సినిమాల ఒప్పందాల కారణంగా ఆలస్యమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

దిగొచ్చిన టోకు ధరల ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: దేశంలో ఎట్టకేలకే టోకు ధరల ద్రవ్యోల్బణం దిగి వచ్చింది. 21 నెలల కనిష్ఠానికి చేరి నవంబర్‌లో ఇది 5.85 శాతంగా నమోదైంది. ఆహార పదార్థాలు, చమురు, తయారీ వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమైంది. ఈ మేరకు కేంద్ర గణాంక కార్యాలయం బుధవారం టోకు ధరల ద్రవ్యోల్బణం గణాంకాలను వెల్లడించింది. టోకు ధరల ఆధారిత సూచీ ద్రవ్యోల్బణం 19 నెలలుగా రెండంకెల సంఖ్య పైనే నమోదవుతూ వస్తోంది. అక్టోబర్‌లో ఇది తొలిసారి 8.39 శాతానికి తగ్గింది. గతేడాది నవంబర్‌లో 14.87 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం తాజాగా 5.85 శాతానికి చేరింది. గతేడాది ఫిబ్రవరిలో కనిష్ఠంగా 4.83 శాతం నమోదైన టోకు ధరల ద్రవ్యోల్బణం, మళ్లీ ఇప్పుడు దాదాపు అదే స్థాయికి చేరడం ఊరటనిచ్చే అంశంగా మారింది. ఆహార పదార్థాలు, టెక్స్‌టైల్స్, కెమికల్స్, కెమికల్ ఉత్పత్తులు, కాగితం, కాగిత ఉత్పత్తుల ధరలు తగ్గడంతో టోకు ధరల ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇక గత నెల 8.33 శాతంగా ఉన్న ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం నవంబర్‌లో 1.07 శాతంగా నమోదైంది. కూరగాయల ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 17.61 శాతంగా ఉండగా.. ఈ సారి 20.08 శాతం క్షీణత నమోదు చేశాయి. చమురు, విద్యుత్ ద్రవ్యోల్బణం 17.35 శాతంగానూ, తయారీ ఉత్పత్తుల ధరలు 3.59 శాతంగానూ నమోదయ్యాయి. సాధారణంగా రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలు తీసుకుంటుంది. ఇటీవలే రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వెల్లడయ్యాయి. అది కూడా 11 నెలల కనిష్ఠంగా ఆర్‌బీఐ లక్షిత స్థాయి (6 శాతం) దిగువకు చేరి 5.88 శాతంగా నమోదైంది. మరోవైపు రెపో రేట్ల విషయంలో ఇప్పటి వరకు దూకుడుగా వ్యవహరించిన ఆర్‌బీఐ.. ఫిబ్రవరిలో మరో 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

జోడో యాత్రలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో సాగుతున్న 'భారత్ జోడో యాత్రలో బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పాల్గొన్నారు. బుధవారం రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్ నుంచి రాహుల్‌లో కలిసి పాల్గొన్న రాజన్, ఆయనతో నడుస్తూ అనేక అంశాలను చర్చించారు. గతంలో నోట్ల రద్దును వ్యతిరేకించడంలో కాంగ్రెస్‌కు రఘురామ్ రాజన్ మద్దతిచ్చిన విషయం తెలిసిందే. రాజన్ కూడా ఈ నోట్ల రద్దుపై బహిరంగంగానే విమర్శలు చేశారు. ఇలాంటి నిర్ణయాల వల్ల దీర్ఘకాల ప్రయోజనాలకు ఆటంకం కలుగుతుందని తాను రాసిన ఓ పుస్తకంలో పేర్కొన్నారు. ఇక, భారత ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటుపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది కాంగ్రెస్‌కు చెందిన ఓ సదస్సులోనూ పాల్గొన్న ఆయన, రాజకీయ నాయకులు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని ఉద్యోగ సంక్షోభాన్ని కప్పిపుచ్చుకోవాలనుకుంటే శ్రీలంక తరహా పరిస్థితులు తలెత్తుతాయని వ్యాఖ్యనించారు. ప్రస్తుతం రాహుల్ చేపట్టిన జోడో యాత్ర రాజస్తాన్‌లో కొనసాగుతోంది. వచ్చే ఏడాది జనవరి చివరకు ఇది కశ్మీర్ చేరుకుంటుంది.

జమ్ము కశ్మీర్‌లో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఉత్సాహం

ఇప్పటి వరకూ రూ.2,500 కోట్లపైగా పెట్టుబడులు

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌కు భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. అక్కడి అధికార యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక పారిశ్రామిక విధానమే దీనికి కారణమని వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. దీనికి తోడు పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొచ్చిన వారికి ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నారు. ఇప్పటి వరకూ జమ్ముకశ్మీర్‌కు రూ.64వేల కోట్ల ప్రతిపాదనలు రాగా, ఇప్పటికే రూ.2,500 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని కేంద్రప్రభుత్వం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఓ ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. జమ్ముకశ్మీర్‌లో 2017-18లో రూ.840.55 కోట్ల పెట్టుబడులు రాగా.. 2018-19లో రూ.590.97 కోట్లు, 2019-20లో రూ.296.64కోట్లు, 2020-21లో రూ.412.74 కోట్లు, 2021-22లో రూ.376.21 కోట్లు వచ్చాయని నిత్యానందరాయ్ వివరించారు.

ఓట్ల మోజులో పాలకులు

- మైనారిటీలపై పేట్రేగిన హింస
- ఎన్నికల కాలంలో పెరిగిన విద్వేషం
- హింసాత్మకంగా పరిణమించిన నవంబర్

న్యూదిల్లీ: గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ దేశంలో ఎక్కడ ఏం జరిగినా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పట్టలేదు. ఓట్ల మోజులో పడి మైనారిటీల వేదన పాలకులకు కనిపించలేదు. బాధితుల రోదన వినిపించలేదు. హిందూత్వమూకల ఆగడాలు పేట్రేగినా, మైనారిటీలపై వేధింపులు పెరిగినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఎన్నికల వేళ విద్వేష-నేరాలు పెద్దఎత్తున చోటుచేసుకున్నప్పటికీ తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తూ కేవలం ఎన్నికలపైనే అధికారపక్షాలు పూర్తిగా దృష్టిని కేంద్రీకరించాయి. ఈ పరిణామాలతో నవంబర్ నెల హింసకు కేరాఫ్‌గా నిలిచింది. దేశ నలుమూలల అనేక హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. నవంబరు నెలమొత్తం బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మైనారిటీలు వేధింపులకు గురయ్యారు.

నేరాల వివరాలు: నవంబరు ఒకటవ తేదీన బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో 20ఏళ్ల ముస్లిం యువకుడిని దారుణంగా హతమార్చారు. హిందూ అమ్మాయిని ప్రేమించడమే నేరంగా అతనిని అమ్మాయి తరఫువారు రాళ్లతో కొట్టి చంపారు. నవంబరు 16న కర్ణాటకలోని ఉడిపి జిల్లాలో ఇంటర్-స్కూల్ తాలూకా స్థాయి స్పోర్ట్స్ డే సందర్భంగా ఆజాన్ (ముస్లింల ప్రార్థనకు పిలుపు)పై హిందూత్వ సంస్థలు రభస సృష్టించాయి. స్కూల్ పిల్లలు సర్వధర్మ ప్రార్థన క్రమంలో హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతాల భక్తిగీతాలు ఆలపించినప్పటికీ ఆజాన్‌ను ఖండించాయి. దీంతో యాజమాన్యం క్షమాపణలు తెలిపింది. నవంబరు 17న కర్ణాటక హైకోర్టులో బజరంగ్ దళ్ కార్యకర్తలు ఓ పిల్ దాఖలు చేసి మాండ్యా జిల్లాలోని జామియా మసీదును వెంటనే ఖాళీ చేయాలని కోరారు. మసీదులో హిందూ దేవతలు, ఆలయ నిర్మాణాల గుర్తులు ఉన్నట్లు వాదనలు వినిపిం చారు. నవంబరు17న ఉత్తరప్రదేశ్ ముజఫర్ నగర్‌లో జిల్లా అధికారులు 300 ఏళ్ల నాటి మసీదును నేలమట్టం చేశారు. రోడ్డు విస్తరణ క్రమంలో 709 ఏడీ నాటి మసీదును కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. నవంబరు 18న కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే తన్వీర్ సేత్‌కు బజరంగ్ దళ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. మైసూరు లేదా శ్రీరంగపట్నంలో టిప్పుసుల్తాన్ ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించినందుకు ఆయనను బెదిరించారు. నవంబరు 22న గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో ఐటీఐ ముస్లిం విద్యార్థులు టోపి, బురఖా ధరించినందుకు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యులు రభస సృష్టించారు. నవంబరు 24న గుజరాత్, సూరత్‌లోని భగవన్ మహవీర్ యూనివర్సిటీలో లవ్ జిహాద్ పేరిట బజరంగ్ దళ్, వీహెచ్‌పీ విద్యార్థి కార్యకర్తలు కలిసి ముస్లిం విద్యార్థిని వేధించారు. అదే రోజు దక్షిణ కర్ణాటక జిల్లాలోని కుక్కె శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద ముస్లిం దుకాణాలు ఉండకూడదని పోస్టర్లను హిందూ జాగరణ్ వేదిక ఏర్పాటు చేసింది. ఈ పోస్టర్లతో తమకు సంబంధం లేదని అప్పట్లో ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. ముస్లిం వ్యాపారులను బహిష్కరించాలని ఆ రాష్ట్ర బీజేపీ నేతలు కొందరు పిలుపునిచ్చారు. కాగా, బస్సులో హిందూ యువతితో కలిసి ప్రయాణించినందుకు సయ్యద్ ఉమర్‌పై బజరంగ్ దళ్ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. ఈ ఘటన కర్ణాటక, మంగళూరులో చోటుచేసుకుంది. నవంబరు 27న ముస్లిం దంపతులను సిల్చర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లోని పేడియాట్రిక్ డాక్టర్ దుర్భాషలాడారు. నవంబరు 26న మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో కస్టోడియల్ హత్య వెలుగుచూసింది. 30ఏళ్ల ఇస్రాయిల్ ఖాన్‌ను తప్పుడు కేసులో ఇరికించారు. పోలీసులు అతనిపై కస్టడీలో లాఠీలతో విరుచుకుపడగా ఖాన్ ప్రాణాలు విడిచాడు. నవంబరు 28న మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్)లో ముస్లిం విద్యార్థిని ఉగ్రవాది అజ్మల్ కసబ్‌తో ప్రొఫెసర్ పోల్చారు. విద్యార్థి ప్రతిఘటించడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ప్రొఫెసర్‌ను మిట్ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఇటువంటి ఘటనలను పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణించే నేతలు కనీసం వారి హక్కులను గౌరవించడం లేదు. స్వేచ్ఛగా జీవించే పరిస్థితుల కల్పనలోనూ విఫలమయ్యారని పై ఘటనలతో స్పష్టమైంది.

షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు జాతీయ అవార్డు

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ కడప జిల్లాకు చెందిన షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు రెండోసారి జాతీయ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు దక్కింది. విద్యుత్ ఆదా చేసినందుకు ఎలక్ట్రికల్ సంస్థలు చేస్తున్న కృషికి గానూ ఈ అవార్డులను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ), మినిస్ట్రీ ఆఫ్ పవర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఈ అవార్డును ప్రదానం చేస్తారు. బుధవారం న్యూదిల్లీలో జరిగిన జాతీయ ఎనర్జీ కన్జర్వేషన్ దినోత్సవం సందర్భంగా, ఈ అవార్డును భారత రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ వంశీరెడ్డి అందుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ, పంపిణీ కేటగిరీలో జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆమోదం పొందేలా, అత్యధిక నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, స్టార్ రేటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లను తయారు చేసినందుకు షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థకు ఈ అవార్డు దక్కింది. 2014లోనే ఈ అవార్డు రాగా ఇప్పుడు రెండోసారి రావడం సంస్థ పనితీరుకు ఉదాహరణగా చెప్పొచ్చు. డా. వైఎస్సార్ జిల్లా కడప ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఏరియాలో 1994లో ప్రారంభమైన షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ వరల్డ్ క్లాస్ ట్రాన్స్‌ఫార్మర్లను తయారు చేస్తూ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ సంస్థ ద్వారా దాదాపు 2000 మందికి పైగా ప్రత్యక్షంగా ఉపాధి పొందుతుండగా, ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు ఆధునిక టెక్నాలజీతో, బ్యాక్ వార్డ్ ఇంటిగ్రేషన్‌తో తయారై, దేశంలోనే కాకుండా దాదాపు 10కి పైగా ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద ట్రాన్స్‌ఫార్మర్ల తయారీదారుగా షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ అవతరించింది.

'ఆర్బిట్రేషన్' బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూదిల్లీ: ఆర్బిట్రేషన్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. న్యూదిల్లీ మధ్యవర్తిత్వ కేంద్రం పేరును భారత అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రంగా మార్చే బిల్లును బుధవారం ఆమోదించింది. కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజీజూ ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు తాజాగా రాజ్యసభ ఆమోదం లభించింది. లోక్‌సభ ఆగస్టులోనే ఆమోదించింది. అంతర్జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ గమ్యస్థానంగా భారత్ ఆవిర్భవించేందుకు ఈ బిల్లు ఉపయుక్తంగా ఉంటుందని రాజ్యసభలో రిజీజూ అన్నారు. ఆర్బిట్రేషన్ హబ్‌గా భారత్ లేదని, చిన్న దేశాలు, నగరాలు కూడా ప్రధాన కేంద్రాలుగా వ్యవహరిస్తున్నాయన్నారు. భారత్ ఆ స్థాయికి చేరాలనే న్యూదిల్లీ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం (సవరణ) బిల్లు, 2022ను తెచ్చామని చెప్పారు. మధ్యవర్తిత్వంలో సింగపూర్, లండన్, హాంగ్‌కాంగ్ కీలక కేంద్రాలుగా ఉన్నాయని, చాలా మంది వీటకే మొగ్గు చూపుతున్నారని తెలిపారు. దేశం ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తున్న క్రమంలో మధ్యవర్తిత్వంలోనూ అంతర్జాతీయ వాణిజ్య సముదాయాన్ని ఆకర్షించాలన్నది లక్ష్యమని, ఇందుకోసం మిగతా కేంద్రాల కంటే సరసమైన ధరలకు సేవలు అందించాలని భావిస్తున్నామన్నారు. ప్రపంచ బ్యాంకు ఒత్తిడి వల్లే ఈ బిల్లును తెచ్చారన్న ఆరోపనలను రిజీజూ తోసిపుచ్చారు. పేరు మార్పుపై ప్రశ్నకు స్పందిస్తూ 'ముంబై, కోల్‌కతా వంటి ముఖ్యనగరాల్లో ఇప్పటికే మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉన్నాయి. దిల్లీలోనూ దిల్లీ ఆర్బిట్రేషన్ సెంటర్ (డీఏసీ) ఉన్నది. ఒకే పేరు మీద రెండు కేంద్రాలు ఉండటం సమంజసం కాదు. అందుకే పేరు మార్చాం' అని రిజీజూ చెప్పారు.

యూపీ గోండులకు ఎస్టీ హోదా బిల్లు రాజ్యసభ అంగీకారం

ఉత్తరప్రదేశ్ గోండులకు ఎస్టీ హోదా కల్పించే బిల్లును మూజూవాణి ఓటు ద్వారా రాజ్యసభ బుధవారం ఆమోదించింది. ఈ చట్టానికి కొన్ని సవరణలు చేసిన అనంతరం ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లును గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా మంగళవారం ప్రవేశపెట్టగా పార్టీలకు అతీతంగా సభ్యులంతా మద్దతిచ్చారు. రాజ్యాంగం (ఎస్టీ) (యూపీ) ఆదేశం, 1967 (ఎస్టీ ఆదేశం), రాజ్యాంగం (ఎస్సీ) ఆదేశం, 1950 (ఎస్సీ ఆదేశం)లో సవరణలను ఈ బిల్లు సూచిస్తుంది. ఉత్తరప్రదేశ్‌లోని చందౌలి, కుషినగర్, సంత్ కబీర్ నగర్, సంత్ రవిదాస్ నగర్ జిల్లాలకు చెందిన గోండులకు షెడ్యూల్డ్ తెగ గుర్తింపు కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టినట్లు ముండా తెలిపారు. గిరిజనుల విషయంలో విపక్షాల వైఖరిని విమర్శించారు. గిరిజనుల గురించి చింతన ఉండివుంటే రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఏకగ్రీవంగా ఎన్నికయ్యేవారని ఆయన అన్నారు.

సీనియర్ల' రాయితీకి చెల్లు చీటీ!

న్యూదిల్లీ: రైళ్లల్లో వృద్ధులకు రాయితీ ఇప్పట్లో ఇచ్చే ప్రసక్తే లేదని కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇప్పటికే రైల్వేలో పింఛనులు, వేతనాలు అధికంగా ఉన్నాయనీ, ఈ కారణంగానే రాయితీ పునరుద్ధరణ వీలుకాదని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు చెందిన స్వతంత్ర ఎంపీ నవనీత్ రాణా అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో ఈ మేరకు ఆయన బుధవారం సమాధానమిచ్చారు. 'ప్రయాణికుల సేవల కోసం ప్రభుత్వం గతేడాది రూ.59 వేల కోట్లు రాయితీ ఇచ్చింది. ఇది చాలా రాష్ట్రాల బడ్జెట్ కంటే చాలా ఎక్కువ. అదే విధంగా పెన్షన్ల కోసం ఏడాదికి రూ.60వేల కోట్లు ఖర్చు చేస్తోంది. వేతనాల కోసం రూ.97వేల కోట్లు ఖర్చవుతుండగా.. చమురు కోసం మరో రూ.40వేల కోట్లు వెచ్చిస్తున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అదే సమయంలో ఎప్పటికప్పుడు కొత్త సదుపాయాలు తీసుకొస్తున్నామని తెలిపారు. ఒకవేళ ఏదైనా కొత్త నిర్ణయం తీసుకుంటే.. రాయితీని అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ప్రస్తుతానికైతే సీనియర్ల రాయితీని తీసుకొచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రతి ఒక్కరూ రైల్వే పరిస్థితిని కూడా చూడాలని కోరారు. వందే భారత్ రైళ్ల గురించి వచ్చిన మరో ప్రశ్నకూ కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం సీటింగ్ సదుపాయంతో ఉన్న ఈ రైళ్లను గరిష్ఠంగా 500-550 కిలోమీటర్ల వరకు నడుపుతున్నామని, పడుకొనే సదుపాయం అందుబాటులోకి వస్తే దూర ప్రయాణాలకు ఈ రైళ్లను వినియోగిస్తామని పేర్కొన్నారు. అయోధ్య ఆలయ నిర్మాణం పూర్తయ్యాక దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రానికి రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రణాళిక ఉందని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 41 ప్రధాన రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామని, మిగిలిన స్టేషన్లను దశలవారీగా చేస్తామని చెప్పారు. 2030 నాటికి రైల్వేను కాలుష్య రహితంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

నేటి నుంచి తూర్పు సెక్టార్‌లో

వైమానిక దళ విన్యాసాలు

న్యూదిల్లీ: వాస్తవాధీన రేఖ వెంట వాయుసేన పనితీరును పరిశీలించాలని ఈస్టర్న్ కమాండ్ నిర్ణయించింది. ఈ మేరకు 15 నుంచి తూర్పు సెక్టార్‌లో రెండురోజుల పాటు భారత వాయుసేన యుద్ధ విన్యాసాలు నిర్వహించ నుంది. దీనిలో ఫైటర్‌జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు, మానవ రహిత విమానాలు పాల్గొననున్నాయి. తేజ్‌పూర్, చబువా, జోర్హాట్, హాషీమరా వైమానిక స్థావరాల సన్నద్ధతను పరిశీలించనున్నారు. దీనికి సంబంధించి ఎప్పుడో షెడ్యూలు కూడా సిద్ధమైంది. ఇటీవల జరిగిన ఘర్షణతో ఈ యుద్ధ విన్యాసాలకు సంబంధం లేదని వాయుసేన చెబుతోంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో యాంగ్జే వద్ద డిసెంబర్ 9వ తేదీన భారత్-చైనా దళాల మధ్య ఘర్షణతో వాస్తవాధీన రేఖ ఉద్రిక్తంగా మారింది. తూర్పు సెక్టార్లో వైమానిక విన్యాసాలు నిర్వహించనున్న సమయంలోనే ఈ ఘర్షణ జరగడం గమనార్హం.

2022లో నెంబర్‌వన్ మూవీగా ఆర్ఆర్ఆర్

ఐఎంబీడీ టాప్-10 జాబితాలో మూడు తెలుగు చిత్రాలు

ముంబై: 2022లో చలనచిత్రాలు, టీవీ కార్యక్రమాలు, ప్రముఖుల సమాచారం అందివ్వడంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఐఎంబీడీ తాజాగా టాప్ 10 భారతీయ చలనచిత్రాలు, వెబ్ సిరీస్‌ల జాబితాను ప్రకటించింది. చిన్న గణాంక నమూనాలు లేదా వృత్తిపరమైన విమర్శకుల నుండి సమీక్షల ఆధారంగా వార్షిక ర్యాంకింగ్‌లను కాకుండా, ఐఎంబీడీ అత్యంత ప్రజాదరణ పొందిన చలనచిత్రాలు, వెబ్ సిరీస్‌ల జాబితాను 200 మిలియన్ల కంటే ఎక్కువ నెలవారీ సందర్శకుల వాస్తవ పేజీ వీక్షణల ఆధారంగా నిర్ణయించింది. టాప్-10 సినిమా జాబితాలో తెలుగు చిత్రం ఆర్ఆర్ఆర్ నెంబర్‌వన్‌గా నిలిచింది. ది కాశ్మీర్ ఫైల్స్, కేజీఎఫ్- చాప్టర్ 2, విక్రమ్, కాంతారా, రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్, మేజర్, సీతా రామం, పొన్నియన్ సెల్వన్: పార్ట్ వన్, 777 చార్లీ చిత్రాలు ఐఎంబీడీ నిలిచాయి. ఇందులో మూడు సినిమాలు తెలుగు చిత్రాలే కావడం విశేషం. ఇక వెబ్‌సిరీస్‌లలో పంచాయితీ నెంబర్‌వన్ స్థానంలో నిలవగా, ఢిల్లీ క్రైమ్, రాకెట్ బాయ్స్, హ్యూమన్, అపహరణ, గుల్లక్, ఎన్‌సీఆర్ డేస్, అభయ్, క్యాంపస్ డైరీస్, కాలేజ్ రొమాన్స్‌లు తదుపరి స్థానాల్లో నిలిచాయి.

ప్రభాస్ పెళ్లి తర్వాత నాది: విశాల్

చెన్నై: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పెళ్లి చేసుకున్న వెంటనే తాను కూడా వివాహ బంధంలోకి అడుగుపెడతానని నటుడు విశాల్ తెలిపారు.. తన పెళ్లిపై వస్తోన్న వార్తల గురించి తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన స్పందించారు. "వివాహం అనేది ఎన్నో బాధ్యతలతో కూడుకున్నది. పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ ప్రస్తుతానికి నా ఫోకస్ మొత్తం వర్క్‌లైఫ్ పైనే ఉంది. నటుడిగా నాకెన్నో బాధ్యతలు ఉన్నాయి. వాటిని నిర్వర్తిస్తున్నాను. పెళ్లి అనేది జోక్ కాదు. వృత్తిపరమైన జీవితం పట్ల ఎంత నిబద్ధతతో వ్యవహరిస్తున్నానో వ్యక్తిగత జీవితంలోనూ అలాగే ఉండాలి" అని తెలిపారు. వచ్చే ఏడాది పెళ్లి చేసుకుంటారా? అని ప్రశ్నించగా.. ప్రభాస్ పెళ్లి చేసుకున్న వెంటనే తాను కూడా పెళ్లి చేసుకుంటానని ఆయన సరదాగా బదులిచ్చారు. 'లాఠీ' సినిమా పనుల్లో విశాల్ ప్రస్తుతం బిజీగా ఉన్నారు. తన కోస్టార్ అభినయతో ఆయన ప్రేమలో ఉన్నారంటూ.. త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకోనున్నారని ఇటీవల వరుస కథనాలు దర్శనమిచ్చాయి. ఇదిలా ఉండగా ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తాను ఓ అమ్మాయితో రిలేషన్‌లో ఉన్నానని, అయితే నడిగర్ సంఘం భవనం నిర్మించేవరకూ పెళ్లి చేసుకోనని చెప్పారు. 2019లో మొదలైన ఈ భవన నిర్మాణం తుది దశకు చేరుకున్నట్లు సమాచారం.

హైదరాబాద్‌లో ప్రారంభమైన పుష్ప-2

హైదరాబాద్: పుష్ప-2' సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఏదంటూ ఈ మధ్యనే అల్లు అర్జున్ అభిమానులు గీతా ఆర్ట్స్ ఎదుట ఆందోళన చేశారు. సినిమా షూటింగ్, తదితర విషయాలేమీ బయటకు చెప్పడం లేదని, తక్షణమే సినిమా అప్‌డేట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే బన్నీ అభిమానులకు ఇప్పుడు శుభవార్త అందింది. 'పుష్ప-2' చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ప్రారంభమైంది. హీరోహీరోయిన్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారని తెలిసింది. అక్కడ షూటింగ్ పూర్తయ్యాక రామోజీ ఫిల్మ్ సిటీకి లొకేషన్ షిఫ్ట్ చేస్తారని బన్నీ సన్నిహితులు నుంచి సమాచారం. ఈ షెడ్యూల్ దాదాపు 10 రోజులపాటు జరగనుందట. హైదరాబాద్ షెడ్యూల్ తర్వాత బ్యాంకాక్‌లోనూ ఓ షెడ్యూల్ ఉంది. అక్కడ అటవీ నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తారు. ఈ నెల 16న విడుదల కానున్న 'అవతార్2' చిత్రం ప్రదర్శించబోతున్న థియేటర్లలో 'పుష్ప 2' గ్లింప్స్‌ను ప్రదర్శిస్తారు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్, అనసూయ కీలక పాత్రధారులు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. 'పుష్ప' మొదటి భాగం సాధించిన విజయంతో 'పుష్ప2'పై భారీ అంజనాలు పెరిగాయి. దాంతో దర్శకుడు సుకుమార్ పార్ట్ 2 విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఆదుకున్న పుజారా, శ్రేయస్

- టాప్ ఆర్డర్ మళ్లీ విఫలం
- క్రీజులో అయ్యర్, అశ్విన్
- తొలిరోజు భారత్ 278/6

చట్టోగ్రాం: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మొదటి టెస్టు మ్యాచులో భారత జట్టును శ్రేయస్ అయ్యర్, ఛటేశ్వర్ పుజారా ఆదుకున్నారు. చట్టోగ్రాం వేదికగా జరిగిన ఈ మ్యాచులో భారత ఇన్నింగ్స్ అనుకున్నట్లు సాగలేదు. పేలవమైన ఆరంభంతో కష్టాల్లో పడిన జట్టును మిడిల్ ఆర్డర్ ఆదుకుంది. దీంతో భారత్ మంచి స్కోరు చేసే దిశగా సాగుతోంది. ఆరంభంలో కుదురుకున్నట్లే కనిపించిన శుభ్‌మన్ గిల్ (20) అవసరమైన షాట్ ఆడి పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత కాసేపటికే కేఎల్ రాహుల్ (22) కూడా నిష్క్రమించాడు. దీంతో క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లి కూడా నిరాశపరిచాడు. ఐదు బంతులు ఎదుర్కొన్న అతను కేవలం ఒక పరుగు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. ఇలాంటి పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ (46) మరో వికెట్ పడకుండా అడ్డుకున్నాడు.

లంచ్ తర్వాత పంత్ అవుట్..

కానీ లంచ్ తర్వాత అతను కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. మెహదీ హసన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడి, ఆ మరుసటి బంతికే వెనుతిరిగాడు. హసన్ వేసిన బంతిని ఎదుర్కొనేందుకు పంత్ రూం తీసుకున్నాడు. ఈ క్రమంలో ఎడ్జ్ తీసుకున్న బంతి వికెట్లను కూల్చింది. దీంతో పంత్ ఇన్నింగ్స్ కూడా ముగిసింది. ఇలా ఒక ఎండ్‌లో వికెట్లు పడుతున్నా మరోపక్క పుజారా (90) మాత్రం గోడలా నిలబడ్డాడు.

అయ్యర్, పుజారా క్లాసిక్

అతనికి జత కలిసిన శ్రేయస్ అయ్యర్ (82 నాటౌట్) కూడా మంచి ఇన్నింగ్స్ ఆడాడు. పుజారా అవుటైన తర్వాత కూడా నిలకడగా రాణించాడు. అతనికి అక్షర్ పటేల్ (14) కొంత సహకారం అందించాడు. కలిసి భారత స్కోరును 278కి చేర్చారు. ఇక మరొక బంతి వేస్తే రోజు ఆట ముగుస్తుంది అనగా.. మెహదీహసన్ మరోసారి భారత జట్టును దెబ్బతీశాడు. అతని బౌలింగ్‌లో అక్షర్ పటేల్ ఎల్బీగా పెవిలియన్ చేరాడు.

చివరి బంతికి వికెట్

దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 278/6 స్కోరుతో నిలిచింది. శ్రేయస్ అయ్యర్ అజేయంగా నిలబడి ఉన్నాడు. గురువారం అయ్యర్, అశ్విన్ కలిసి ఎంత స్కోర్ చేస్తే భారత జట్టుకు అంత మంచిది. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం 3, మెహదీ హసన్ 2 వికెట్లు తీసుకోగా.. ఖలీద్ అహ్మద్ ఒక వికెట్ పడగొట్టాడు.

రంజీలో అర్జున్ శతక్కొట్టుడు

పనాజీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నాడు. రంజీ ట్రోఫీలో భాగంగా బుధవారం రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ యువ ఆటగాడు అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. గోవా తరపున బరిలోకి దిగిన అర్జున్ నైట్ వాచ్‌మెన్‌గా బ్యాటింగ్‌కు దిగి శతకం బాదేశాడు. దీంతో గోవా భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. గతంలో సచిన్ కూడా తన తొలి రంజీ మ్యాచ్‌లోనే సెంచరీ కొట్టాడు. 1988 రంజీ ట్రోఫీలోకి కేవలం 15 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన సచిన్ మొదటి సెంచరీని నమోదు చేశాడు.

నైట్‌వాచ్‌మన్‌గా వచ్చి

రాజస్తాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తొలి రోజు ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన అర్జున్ 15 బంతుల్లో 4 పరుగులతో నాటౌట్‌గా మిగిలాడు. రెండో రోజు మాత్రం తన సత్తా ఏమిటో చూపుతూ విజృంభించాడు. 207 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 120 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. మరో బ్యాటర్ సుయాంశ్ ప్రభుదేశాయ్ (212 నాటౌట్)తో కలిసి అర్జున్ గోవా ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీరిద్దరూ కలిసి ఆరో వికెట్‌కు 221 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో గోవా జట్టు రెండో రోజు ఆట ముగిసేసమయానికి 493/8 భారీ స్కోరు చేసింది.

ముంబయి నుంచి గోవాకు

2018 శ్రీలంక పర్యటనలో భాగంగా అండర్-19 క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అర్జున్, ప్రపంచకప్ జట్టులో మాత్రం ఆడలేకపోయాడు. భారత టీ20 లీగ్‌లో ముంబై ఫ్రాంచైజీ కొనుగోలు చేసిన తర్వాత ఒక్క మ్యాచ్‌లో సైతం ఆడలేకపోయాడు. ఈ విషయంపై హెడ్ కోచ్ మహేల జయవర్ధనె స్పందిస్తూ ఆటపరంగా అతడింకా కొన్ని అంశాల్లో మెరుగవ్వాల్సిన అవసరం ఉందని తెలిపాడు.

ఆధిక్యంలో ముంబై జట్టు

విశాలాంధ్ర- విజయనగరంటౌన్: విజయనగరంలోని స్థానిక చింతలవలస పీవీజీ రాజు క్రికెట్ మైదానంలో ముంబై-ఆంధ్ర జట్ల మధ్య జరుగుతున్న రంజీ రెండో రోజు మ్యాచ్‌లో ముంబై మొదటి ఇన్నింగ్స్‌లో 6వికెట్లు నష్టానికి 290 పరుగులు చేసి, 152 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ముంబై బ్యాటింగ్‌లో అమామ్ జాఫర్ 116 పరుగులు, యశస్వి జైస్వాల్ 45పరుగులు, అజింక్య రహానే 44 పరుగులు చేశారు. తనుష కొటియన్ 43 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ మూడు వికెట్లు, సోయాభ్ ఎండీ ఖాన్ రెండు వికెట్లు సాధించారు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 238 పరుగులకు అలౌట్ అయిన విషయం తెలిసిందే.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.